



రెప్పపాటులో..

- డివైడర్ దాటుకొచ్చిన మృత్యువు
- కారు ఢీకొని ముగ్గురు మృతి
- బంధపురం వద్ద విషాదఘటన

7వ పేజీ, మెయిన్‌లో

అధినేతలు..ఆగయా


కాకినాడకు నేడు జగన్.. రేపు పవన్.. - 7లో
10న తునికి చంద్రబాబు రాక.. 20న మండపేట, 27 గోపాలపురంలో బాబు బహిరంగ సభలు

జగన్.. ఝలక్!

- రాజమహేంద్రవరం వైసీపీకి కొత్త అభ్యర్థులు
- సిటీకి ఎంపీ భరత్, రూరల్‌కు మంత్రి వేణు
- నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియామకం
- వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన
- డా.గూడూరి, చందన అవుట్
- హర్షకుమార్‌తో చందన మంతనాలు?


రాజమహేంద్రవరం, జనవరి2(ఆంధ్రజ్యోతి) : ఇంతకాలం పార్టీని నడిపించిన వారికి జగన్ ఝలక్ ఇచ్చారు.. తూర్పుగోదావరి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలకు కొత్తవారికి కేటాయించారు. దీంతో ఇప్పటి వరకూ ఆయా నియోజకవర్గాల్లో పార్టీని నడిపించిన నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం ఎంపీగా ఉన్న మార్గాని భరత్ రామ్‌ను సిటీ నియోజకవర్గానికి పంపించింది. రామచంద్రపురం ఎమ్మెల్యేగా నెగ్గి ప్రస్తుతం మంత్రిగా ఉన్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి బదిలీ చేసింది. నియోజకవర్గ సమన్వయకర్తల పేరుతో వీరి పేర్లను వైసీపీ కేంద్రకార్యాలయం మంగళవారం ప్రకటించింది. మంత్రి వేణు, ఎంపీ భరత్ కూడా అయిష్టంగానే ఈ స్థానాలకు వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.వీరి రాకతో ఇప్పటి వరకూ సిటీ ఆకోర్డినేటర్‌గా ఉన్న డా.గూడూరి శ్రీనివాసరావు, రూరల్ కోఆర్డినేటర్‌గా ఉన్న చందన నాగేశ్వర్ వారి స్థానాల నుంచి అవుట్ అయ్యారు. అయితే ఇంకా వారిని వైసీపీ నేతలు మభ్యపెడుతుండడం గమనార్హం. పైకి తేలడంలేదు.కానీ బీసీ సామాజికవర్గానికి చెందిన చందన కుటుంబం తీవ్ర అసంతృప్తికి లోనైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత నాలుగున్నరేళ్లుగా ఎంతో డబ్బు ఖర్చుపెట్టి.. పార్టీని కాపాడుకుంటూ వస్తే చివరికి దగా చేసినట్టు వాపోతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట మాజీ ఎమ్మెల్యే చందన రమేష్, ఆయన తనయుడు, చందన నాగేశ్వర్ కలసి హర్షకుమార్‌తో చాలా సేపు ఈ విషయాలనే చర్చించినట్టు తెలిసింది. వారు ముగ్గురు ఉన్న ఫొటో ఒకటి బయటకు కూడా వచ్చింది. ఈ పరిస్థితులు ఏ పరిణామాలకు దారితీస్తాయనేది చర్చనీయాంశమైంది. డా. గూడూరి శ్రీనివాసరావుకు ఎంపీ ఇస్తారని చెబుతున్నట్టు ప్రచారం జరిగింది. ఇది వాస్తవం కాదని కొందరు చెబుతున్నారు. ఇక సిటీలో మార్గాని భరత్, రూరల్‌లో చెల్లుబోయిన వేణు కొన్ని సవాళ్లను ఎదుర్కోక తప్పని పరిస్థితి. సిటీలో భరత్‌కు వ్యతిరేక వర్గాలు ఎక్కువగా ఉన్నాయి. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణం వ్యతిరేకంగా ఉన్నారు. రుడా చైర్మన్ పదవి చేతికి మళ్లీ దక్కినట్టే దక్కి చేజారిపోవడానికి ఎంపీ భరత్ కారణమనే ఆగ్రహంతో రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, ఆమె భర్త అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. రూరల్‌లో సీటు దక్కకపోవడంతో చందన నాగేశ్వర్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే, అసలే రూరల్ ఇబ్బందిలో ఉన్న వైసీపీకి కష్టాలే. అంతేకాక రెండు స్థానాలకు కొత్త అభ్యర్థులను బదిలీ చేయడం పట్ల స్థానికంగా టికెట్లు ఆశించేవారు కూడా అసహనానికి గురవుతున్నారు. వారి స్థానాలు వారికి ఉంచి, కొత్తవారికి ఇస్తే మంచిదనే వాదన ఉంది. కానీ చివరకు వైసీపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంతో కొందరు పార్టీలు కూడా మారే అవకాశాలు లేకపోలేదు.

ఇన్



వేణు
భరత్

అవుట్



చందన
గూడూరి



ఉరి వేసుకుని సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన ప్రదర్శన

మాకు ఉరే సరి!

జగన్ మాటలు నమ్మినందుకు మాకదే శిక్ష

రాజమహేంద్రవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సందర్భంగా జగన్ మాటలు నమ్మినందుకు ఉరే గతి అని సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, జగన్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా 14వ రోజైన మంగళవారం ఉద్యోగులు మెడకు ఉరితాడు బిగించుకొని తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. భవిత కేంద్రాల్లో ఎంతో ఓర్పు, నేర్పుతో దివ్యాంగ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులపై ప్రభుత్వ తీరు సరికాదని భవిత కేంద్రాలకు తమ పిల్లలను పంపిస్తున్న కొప్పర్తి పద్మ, అడ్డారి వినీత, గోపీలీలా భవానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులతో సామరస్య వాతావరణంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అనపర్తి మండల ప్రైవేటు పాఠశాలల సంఘ అధ్యక్షుడు ఎస్.నాగార్జున డిమాండ్ చేశారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించడం ప్రభుత్వానికి క్షేమకరం కాదని, ఉద్యమం ఉధృతం చేస్తామని ఎం.రఘునాథ్, డి.వంశీకృష్ణంరాజు, పి.దుర్గాప్రసాద్ తదితరులు తెలిపారు.

సైబర్ నేరాలపై డయల్ 1930

రాజమహేంద్రవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, గంజాయి వల్ల దుష్పరిణామాలపై విద్యార్థులకు తరచుగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల ప్రధానో పాధ్యాయులు(ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు(ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చెడుదారి పట్టకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ అనవసర లింక్‌లను క్లిక్ చేస్తే అన ర్థాలు తప్పవన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, చాటింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనపుడు వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, యాజమాన్యాలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ జనవరి2: ప్రజా ఆరోగ్యానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. ఒకటో విడతలో 441 వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారంలో రెండు సార్లు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, గతంలో డాక్టర్లు సూచించిన కేస్ షీట్, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కంటి వెలుగు పథకంలో భాగంగా కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, తహశీల్దార్ చిన్నారావు, గ్రామ కార్యదర్శి రాణి తదితరులు పాల్గొన్నారు.

బంకుల వద్ద..క్యూ

పెట్రోలు కొరతంటూ వదంతులే కారణం

రాజమహేంద్రవరం,జనవరి 2(ఆంధ్రజ్యోతి): పెట్రోలు, డీజిల్ సరఫరా డీలర్లు,ట్యాంకర్ల యజమానులు సమ్మెకు దిగుతున్నారనే వార్తలు వ్యాపించడంతో బంకుల వద్ద వాహనదారులు భారీగా క్యూ కట్టారు. జేబులో ఉన్నదంతా తీసి ట్యాంకులు ఫుల్ చేయించేశారు.ఎందుకని ఆరా తీస్తే.. హైదరాబాద్‌లో పెట్రోలుకు కొరత ఏర్పడిందనే వార్తలు వ్యాపించడంతో మధ్యాహ్నం నుంచి బైక్‌లు, కార్లు పెద్ద సంఖ్యలో బంకుల వద్దకు చేరుకోవడం, పంజాగుట్ట నుంచి మాదాపూర్ వరకూ ట్రాఫిక్ నిలిచిపోయిన విషయం న్యూస్ చానెళ్లలో రావడంతో జిల్లాలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. పలు బంకుల వద్ద వాహనదారులు క్యూకట్టారు. కొన్ని బంకుల వద్ద బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. లూజు విక్రయదారులు పెట్రోల్ అమ్మకాలు నిలిపివేశారు.అయితే, జిల్లా పౌర సరఫరాల అధికారిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇవన్నీ వదంతులని కొట్టిపారేశారు.అలాంటి సమ్మె ఏమీ తమ దృష్టికి రాలేదని, ఒకవేళ ఉన్నా ఇంధన నిల్వలకు ఇబ్బంది కలిగే అవకాశం లేదని.. కంగారు పడవద్దని చెప్పారు.

పండుగకు.. ఫుల్!



రైళ్లలో చాంతాడంత వెయిటింగ్ లిస్ట్

- అన్నిరైళ్ల రిజర్వేషన్లు ఫుల్‌గా..
- గౌతమికి నిల్, గోదావరికి 13న 398..
- 200 దాటిన వందేభారత్
- అటూ ఇటూ ప్రయాణ యాతనే
- ఇప్పటి నుంచే పండుగ రద్దీ
- 19 వరకూ వెయిటింగ్ లిస్టే
- ఇంటర్ సిటీలు వేయాలని వేడుకోలు
- ఆర్టీసీ రిజర్వేషన్లూ ఫుల్
- సంక్రాంతికి 45 ప్రత్యేక బస్‌లు
- ప్రైవేటు బస్సులు దోపిడీ షురూ
- చార్జీలు పెంచేసిన వైనం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండక్కి ప్రయాణ నరకం తప్పేట్లు లేదు. ఇప్పటికే రైళ్లలో వెయిటింగ్ లిస్టు చాంతాడును మించిపోయింది.ఏసీ తరగతులదీ అదే పరిస్థితి. మరోవైపు పండుగ సందర్భంగా ఆర్టీసీ వేసిన ప్రత్యేక బస్సుల్లోని రిజర్వేషన్లూ నిండుకున్నాయని సమాచారం. ఇదే అదనుగా ఎప్పటి మాదిరిగానే ప్రైవేటు బస్సులు చార్జీల బాదుడు మొదలు పెట్టేశాయి. ఆంధ్రాలో సంక్రాంతి పెద్ద పండుగ. సుదూర ప్రాంతాల్లో ఉన్నవాళ్లు ఎంతో ఉత్సాహంగా తమ సొం తూళ్లకు, బంధువుల ఇంటికి వస్తుం టారు. పైగా సంక్రాం తిలో గోదావరి జిల్లాలకు రావడానికి తహతహలాడుతుంటారు.ఈ మూడు రోజుల కోసం ఏడాదంతా ఎదురు చూసే వాళ్లూ ఉన్నారు.ఎందుకంటే పెద్ద పండుగకు గోదారి జిల్లాలంటే ఠక్కున కోళ్ల పందేలు గుర్తొస్తాయి.డూడూ బసవన్నలు,రంగవల్లికలు, జాత రలు, ఆటపాటలు, పచ్చని ప్రకృతితో ఈ జిల్లాలు కొత్త అందాలను సంతరించుకుంటాయి.అందుకే హైదరాబాద్ నుంచి కాకి నాడ, రాజమండ్రి, విశాఖ వైపు సంక్రాంతికి ఉన్నంత ప్రయాణ రద్దీ మిగతా రోజుల్లో ఉండదు. రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా సాధారణ రోజుల్లో రోజుకు 10 వేల మంది వరకూ రాకపోకలు సాగిస్తుండగా ఆ మూడు రోజుల ముందు వెనుకా సంఖ్య 20 వేలకు చేరుపోతుంది.

రైళ్లలో రిజర్వేషన్లు నిల్

కొంతకాలం నుంచీ మరమ్మతుల పేరుతో పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేస్తూ చిన్న సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. దీంతో ప్రతి రైళ్లలోనూ స్లీపర్ క్లాసు కూడా జనరల్ బోగీలను తలపిస్తోంది. ఏసీ బోగీలు నిండిపోతున్నాయి. రాజమండ్రి గుండా గతంలో 100 రైళ్ల వరకూ రోజువారీ, బైవీక్లీ, ట్రైవీక్లీ రైళ్లు నడిచేవి. ఇప్పుడు ఆ సంఖ్య అమాంతం సుమారు 30కి పడిపోయింది. దీంతో సాధారణ రోజుల్లో సైతం రిజర్వేషన్లు దొరకడం కష్టమవుతోంది. ఇక పండుగ ప్రయాణానికి వస్తే(2వ తేదీ సాయంత్రం సమయానికి చూస్తే) 11,12,13 తేదీల్లో ప్రత్యేక రైళ్లతో సహా అన్ని రైళ్లలోనూ రిజర్వేషన్లు నిండుకున్నాయి. స్లీపర్‌తో పాటు ఏసీ తరగతుల వెయిటింగ్ లిస్ట్ కూడా ఎక్కువగానే ఉంది. తిరుగు ప్రయాణంలో 16, 17, 18, 19 తేదీల్లోనూ అదే పరిస్థితి ఉంది. హైదరాబాద్ నుంచి ఎక్కువగా ఇటువైపు ప్రాంతాలకు జనాలు రాకపోకలు సాగించే విశాఖ,ఎల్‌టీటీ, గౌతమి, గరీబ్‌రథ్, కోణార్క్, ఫలక్‌నుమాకు 11,12, 13న రిజర్వేషన్లు ఫుల్ అయిపోయాయి.వెయిటింగ్ లిస్ట్ కూడా లేవు. గోదావరికి 11, 12న రిజర్వేషన్లు అయిపోగా 13న వెయిటింగ్ లిస్ట్ 398 ఉంది. థర్డ్ ఏసీ కూడా వెయిటింగ్ లిస్ట్ 190 దాటిం ది. ఈస్ట్‌కోస్ట్ 11న 307, 12న 386, 13న 320 వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నాయి. జన్మభూమిలో కూడా సెకండ్ సిట్టింగ్ 11, 12, 13న లేవు. 14న వెయిటింగ్‌లిస్ట్ 142 ఉంది. ఏసీ చైర్‌కార్ బోగీల్లోనూ వెయిటింగ్ లిస్టే. స్పెషల్ రైళ్లు 07446 11, 13న రిజర్వేషన్లు ఫుల్. 11న 07653లో స్లీపర్ వెయిటింగ్ లిస్ట్ 212, 08580లో 286 ఉంది.వారానికి రెండుసార్లు నడిచే నాందేడ్-విశాఖకు 11న వెయిటింగ్ లిస్ట్ 290కి చేరింది. వందేభారత్‌లో 11న 203, 12న 309, 13న 257 వెయిట్‌లిస్ట్ ఉంది. 11న అమావాస్య అయి నప్పటికీ రైళ్లలో రద్దీ తారస్థాయికి చేరుకోవడం గమనా ర్హం. ఇక, తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్లడానికి గౌతమి 16న 184, 17న 354, 18న 238తో, ఈస్ట్‌కోస్ట్ 23 వరకూ వెయిట్‌లిస్టే ఉంది. గోదావరి స్లీపర్ వెయిట్‌లిస్ట్ 250 దాటగా, థర్డ్‌ఏసీ 150 దాటింది. గరీబ్ రథ్‌కి, జన్మ భూమి, కోకనాడ,విశాఖ రైళ్లకూ వెయిట్‌లిస్ట్ పరుగులు పెడు తోంది. ఇదిలా ఉండగా పండుగల్లో హైదరాబాద్ నుం చి విజయవాడ,రాజమండ్రి,విశాఖకు రానుపోను ఇంటర్ సిటీ రైళ్లను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనివల్ల రైల్వేకు అదనపు ఆదాయం సమకూరుతుందంటున్నారు.

ఆర్టీసీదీ అదే రూటు

హైదరాబాద్ నుంచి సాధారణ రోజుల్లో ఉన్న సర్వీసులతో పాటు 45 సర్వీసులను పండుగకు ప్రత్యేకంగా వేశారు.వాటికి 90 శాతం సీట్లు ఇప్పటికే బుక్ అయిపోయాయని తెలుస్తోంది. ఇంకా అదనపు సర్వీసులు వేసే అవకాశంపై ఆలోచన చేస్తున్నారు. టీఎస్‌ఆర్టీసీ 4 సర్వీసులను నడుపుతోంది. ఆర్టీసీలో కూడా ప్రయాణానికి దారి కానరాకపోవడంతో ప్రైవేట బస్సులను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఉంది. ఇదే అదనుగా చార్జీలను బాదేసే దారి పట్టారు.ప్రైవేటు బస్సుల్లో హైదరాబాద్ నుంచి రాజ మండ్రికి పండుగ రోజుల్లో నాన్ ఏసీ సీటర్/స్లీపర్ బస్సులకు రూ.1400 నుంచి 2500 వరకూ రేటు పెట్టారు. 11న ఏసీ స్లీపర్ కొన్ని బస్సులకు రూ.3 వేల నుంచి రూ.3500 ఉంది.ఇక బాత్‌రూంలు బస్సుల్లోనే ఉండే ఏసీ స్లీపర్ ఇంటర్ సిటీ స్మార్ట్ బస్‌లకు టికెట్ ధర ఏకంగా రూ.4500 ఉంది. అంటే భార్యా, భర్త, ఇద్దరు పిల్లలు ఈ బస్సులో వచ్చి వెళ్లడానికి అక్షరాలా రూ.36 వేలు సమర్పించుకోవాలన్నమాట.దీంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

కొత్త పేరుతో.. పాత దొంగలు

- యథేచ్ఛగా సా..గుతున్న ఇసుక దోపిడీ
- ప్రతిమా కనస్ట్రక్షన్‌తో ఒప్పందం
- ర్యాంపులు ఖరారు కాకుండానే తవ్వకం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఇసుక వ్యాపారానికి కొత్త కాంట్రాక్టు సంస్థ వచ్చింది. కానీ అధికారులు ఇంకా ర్యాంపులు అప్పగించకుండా కొత్తపేరుతో పాత దొంగలు ఇసుక దోపిడీ చేసేస్తున్నారు. జేపీ సంస్థకు గత మే నెలలో కాంట్రాక్టు సంస్థ గడువు ముగిసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అనామకుల పేర్లతో ర్యాంపులు నడచిపోతున్నాయి. కానీ పాత బిల్లులే ఇచ్చారు. దీనిపై ఎంత మంది గోడుపెట్టినా ఎవరూ పట్టించుకోలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం కొత్త కాంట్రాక్టు సంస్థను తెరమీదకు తెచ్చింది. ప్రతిమా కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేర ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పుగోదావరి, కాకి నాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఇసుక వ్యాపారమంతా ఈ సంస్థకే అప్పగించారు.కానీ జిల్లాలో ఇంకా ఈ సంస్థకు గోదావరి ఇసుక ర్యాంపులు అప్పగించలేదు. సీతానగరం మండలం ముని కూడలి తదితర ప్రాంతాల్లో ప్రతిమా కన్‌స్ట్రక్షన్ పేర ఉన్న బిల్లులతో ఇప్పటికే తవ్వేస్తున్నారు. అధికారులేమో అసలు ఆ ర్యాం పులకు అనుమతులు లేవని చెబుతున్నారు. అఖండగోదావరిలో డీ సిల్టేషన్‌కు గత నెల 27తో గడువు ముగిసింది. తిరిగి ఇంకా అనుమతివ్వలేదు. కానీ గాయత్రి, కాతేరు, వెంకటనగర్ ర్యాం పుల్లో రాత్రీపగలూ డ్రెడ్జింగ్ చేస్తున్నారు. పబ్లిక్‌గా ఇసుక అమ్మేస్తున్నారు.రూ.కోట్లు దోపిడీ చేస్తున్నారు. వాస్తవానికి ప్రతి మా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇసుక వ్యాపారానికి వచ్చిందని అధికా రులు చెబుతున్నారు.వారికి 25 ర్యాంపుల వరకూ అప్పగించ డానికి జిల్లా స్థాయి ఇసుక కమిటీలో నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.ఇంకా ఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారుల వద్ద జాబితా పెండింగ్‌లో ఉంది.డీ సిల్టేషన్‌కు కూడా అనుమతి లేదు.ఈ పరిస్థితుల్లో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

సీజ్ చేసిన ఇసుకా బేరమే..

గతంలో కోటిలింగాల రేవు ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకున్న ఇసుకను కాతేరు ప్రాంతంలో ఓ విద్యాసంస్థ సమీపంలో స్టాక్ పెట్టారు. దానిపై ఫిర్యాదులు రావడంతో సీజ్ చేశారు. అప్పట్లో ఫైన్ కూడా వేసినట్టు ప్రచారం జరిగింది.కొందరు నేతల ఒత్తిడి వల్ల ఈఫైన్ రద్దు చేయించుకోవడానికి వేరే బిల్లులు సమర్పించినట్టు సమాచారం.అధికారులు ప్రస్తుతం ఈ బిల్లులు పరిశీలిస్తున్నామని చెప్పారు.

కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
A Government of India Undertaking
Together We Can
కెనరా బ్యాంక్
ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి
ABN

జిల్లా ముగ్గుల పోటీల స్పాన్సర్:



ఆదిరెడ్డి అప్పారావు దంపతులు
ఆదిరెడ్డి వాసు, భవానీ దంపతులు
భవానీ చారిటబుల్ ట్రస్ట్
రాజమహేంద్రవరం

సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించే కేంద్రం:
తూర్పుగోదావరి జిల్లా :
పోటీ జరిగే తేదీ : 6 శనివారం, జనవరి 2024
ప్రదేశం : షిరిడీ సాయి జూనియర్ కాలేజీ,
రిలయన్స్ డిజిటల్ ఎదురుగా, జేఎన్ రోడ్, రాజమహేంద్రవరం
ముత్యాల ముగ్గు పోటీలకు మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నెం: 99854 11248

ముగ్గుల పోటీ నిబంధనలు
1. మహిళలు మాత్రమే పాల్గొనాలి.
2. ముగ్గు, రంగులు, పువ్వులు, ఇతరత్రా సామాగ్రి స్వయంగా తెచ్చుకోవాలి.
3. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి.
4. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు అనేవి చెప్పగలగాలి.
5. ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు.
6. న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం.
7. ముగ్గును చేతితోనే వేయాలి. గొట్టాలు, బద్దలు వంటి ఉపయోగించి వేయకూడదు. జల్లెడ మాత్రం ఉపయోగించవచ్చు.
8. ముగ్గుల్లో గొబ్బెమ్మల వంటివి అమర్చవచ్చు. ఇతరత్రా వస్తువులు ఎక్కువగా అమర్చకూడదు. ముగ్గుకు అందం ఇవ్వడానికి ఇతర వస్తువులు వాడాలి తప్పితే ఆ వస్తువులనే ప్రధానాంశంగా చేసుకోకూడదు.

మొదటి బహుమతి రూ.6000/-
రెండో బహుమతి రూ.4000/-
మూడో బహుమతి రూ.3000/-


కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
Together We Can
సంతోషాల వసంతం, మీ ముంగిట
కెనరా గృహ రుణం 8.40%
కెనరా వాహన రుణం 8.70%
ప్రాసెసింగ్ మరియు డాక్యుమెంటేషన్ ఛార్జీలు మాఫీ
www.canarabank.com 1800 1030

Powered By
AIMS INSTITUTES
Peenya, Bangalore
AIMS EMPOWERING MINDS



PROGRAMMES OFFERED
MBA | MBA In France | PGDM | BBA | BBA (Aviation)
BCOM | MCOM | MFA (Financial Analysis) | DIPLOMA Swiss Professional Diplomas in Hospitality (Culinary / Food & Beverage / Rooms service)
BCA | MCA | BHM
MSW | PUC (PCMB/PCMC/CEBA)
AIMS Institutes: 1st Cross, 1st Stage, Peenya, Bangalore
AIMS Admissions Centre +91 81500 01994
www.theaims.ac.in/apply
admission@theaims.ac.in

Real Partner



SWARGASEEMA SUKETANA
DTCP APPROVED
TS RERA P01400006315
KONDURG @SHADNAGAR (HYDERABAD)
DTCP & RERA APPROVED PLOTS
Ph: 9849012500
CALL US FOR FREE SITE VISIT

అధినేతలు ఆగయా..

నేడు సీఎం జగన్ కాకినాడ రాక

రేపు పవన్ కాకినాడకు రాక: మూడు రోజులు అక్కడే మకాం

10న తుని రానున్న టీడీపీ అధినేత చంద్రబాబు:లక్ష మందితో సభ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల వేడి ఊపందుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల అధినేతల వరుస పర్యటనలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వేడెక్కుతోంది. ముంచుకొస్తున్న అసెంబ్లీ ఎన్నికల సమరాన్ని ముందే తెచ్చేస్తోంది. ఇందుకు నిదర్శనమే జిల్లాలో సీఎం జగన్, జనసేన అధినేత పవన్, టీడీపీ అధినేత చంద్రబాబుల వరుస పర్యటనలు.. సభలు నిర్వహిస్తున్న తీరు. రోజుల వ్యవధిలోనే ఈ ముగ్గురు అధినేతలు జిల్లాలోకి అడుగుపెట్టబోతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన సంక్షేమంపై చెప్పుకోవడానికి సీఎం జగన్ నేడు కాకినాడ పర్యటిస్తుండగా, ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తుతూ పోరాడుతున్న జనసేన అధినేత పవన్ ఈనెల 4న, టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10, 20, 27 తేదీల్లో మూడు పార్లమెంట్ కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించబోతున్నారు. దీంతో ఈ మూడు పార్టీల రాజకీయ కార్యకలాపాలతో హోరెత్తనుంది.

సీఎం వస్తున్నారు...జనాన్ని తీసుకురండి

సీఎం జగన్ బుధవారం కాకినాడ నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 9.40 గంటలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయలుదేరి 10.20 గంటలకు కాకినాడ పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు షో ద్వారా 10.40 గంటలకు రంగరాయ మెడికల్ కాలేజీ మైదానానికి చేరుకుంటారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్ కానుక నిధులను జగన్ విడుదల చేస్తారు. ఈనెల నుంచి రూ.3 వేల పెన్షన్ డబ్బులను చెల్లిస్తున్న నేపథ్యంలో దాన్ని ప్రచారం చేసుకోవడానికి వీలుగా అక్కడే భారీ బహిరంగసభలో సీఎం ప్రసంగించనున్నారు. తిరిగి 12 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ గంటపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి తాడేపల్లికి పయనమవుతారు. బహిరంగ సభకు ముందు కాకినాడ నగరంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి సీఎం జగన్ ప్రారంభోత్సవాలను చేయనున్నారు. సభావేదికకు సమీపంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను జగన్ ఆవిష్కరిస్తారు. కాగా సీఎం జగన్ సభకు వేలల్లో జనాలను తరలించేందుకు ప్రభుత్వం అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి జనాలను తరలించేందుకు పార్టీ నేతలు, అధికారులకు టార్గెట్లు విధించింది. ప్రధానంగా వలంటీర్లు అయితే తమ పరిధిలోని పింఛన్‌దారులను బెదిరిస్తూ ఆడియో మెసేజ్‌లు పంపారు. తమ సమీపంలోని సచివాలయాలకు పెన్షన్‌దారులు బుధవారం ఉదయం ఏడుకు చేరుకోవాలని, అక్కడి నుంచి సీఎం సభకు వెళ్లాలని హుకుం జారీ చేశారు. రాకపోతే పెరిగిన పెన్షన్ డబ్బులు అందవని కూడా హెచ్చరించారు. ఈ మేరకు కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఓ వలంటీర్ బెదిరింపుల ఆడియో బయటకు లీకైంది. మరోపక్క ప్రతిపక్ష టీడీపీ నిర్వహించే కార్యక్రమాలకు ఒక్క బస్సు కూడా అద్దెకు ఇవ్వని ఆర్టీసీ, సీఎం సభ కోసం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి 318 బస్సులను పంపుతోంది. ఆయా జిల్లాల నుంచి సీఎం సభ కోసం ఇవన్నీ బుధవారం ఉదయం కాకినాడకు చేరుకోనున్నాయి.

మూడు రోజులు పవన్ ఇక్కడే...

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 4న కాకినాడకు రానున్నారు. మూడు రోజుల పాటు ఓ ప్రైవేటు అతిథిగృహంలో బసచేయనున్నారు. తొలిరోజు కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి 28 వార్డులపై విడివిడిగా సమీక్షించనున్నారు. ఆ తర్వాత కాకినాడ రూరల్, అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 12 నియోజకవర్గాలపై సమీక్షిస్తారు. వాస్తవానికి గత నెల 27 నుంచి పవన్‌కల్యాణ్ కాకినాడలో మూడు రోజులు మకాం వేశారు. కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలపై కూలంకుష సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలపై సమీక్షించారు. ఎక్కడ పోటీచేస్తే బాగుంటుంది? ఎక్కడ ఇంకా పార్టీ మరింత బలోపేతం అవ్వాలి? అనేదానిపై ఇంచార్జులతో సమీక్షించారు. ఆ తర్వాత మరో రెండు రోజులు ఏకంగా కాకినాడ సిటీ నియోజకవర్గంపై సమీక్షించారు. తద్వారా కాకినాడ సిటీ నుంచి అసెంబ్లీకి పవన్ పోటీ చేస్తారనే ప్రచారానికి మరింత బలం కల్పించారు. తిరిగి మళ్లీ ఈనెల 4 నుంచి మూడు రోజులు ఇక్కడే మకాం వేయడం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. పవన్ కాకినాడలో ఉన్నప్పుడే జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆయన్ను కలిశారు. దీంతో వైసీపీ వర్గాలకు భారీ షాక్ తగిలింది. వైసీపీ ఎమ్మెల్యే నేరుగా పవన్ కలవడం జనసేనలో చేరడానికేననే ప్రచారం బలపడింది. అయితే రెండో విడత కాకినాడకు పవన్ వస్తున్న నేపథ్యంలో ఈసారి వైసీపీ నుంచి ఎంతమంది ఎమ్మెల్యేలు వస్తారోననే భయం అధికార పార్టీకి కునుకులేకుండా చేస్తోంది. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను వైసీపీ తప్పించాలని నిర్ణయించింది. వీరిలో ఒకరు ఇప్పటికే పవన్‌ను కలవగా, మిగిలిన ఇద్దరిలో ఎవరు ఏ నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.

లక్ష మందితో దద్దరిల్లేలా...

టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10న తునికి వస్తున్నారు. ఆరోజు లక్ష మందితో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. జగన్ ప్రభుత్వ అరాచకాలు, అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభల ద్వారా విరుచుకుపడుతున్న చంద్రబాబు అందులోభాగంగా కాకినాడ పార్లమెంట్‌కు సంబంధించి సభను తునిలో నిర్వహిస్తున్నారు. తొలుత పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటన ఖాయం అయినా ఆ తర్వాత వేదిక తునికి మార్చారు. ఆరోజు కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి లక్షమందికిపైగా తునికి చేరుకునేలా జిల్లా టీడీపీ సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి సంక్రాంతి తర్వాత సభ నిర్వహించాలని భావించారు. కానీ ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో వాయిదా వేయకుండా సభ జరపాలని పార్టీ వర్గాలు నిర్ణయించాయి. మరోపక్క డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం పార్లమెంట్ పరిధిలో సభను మండపేటలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు జనవరి 20వ తేదీ ఖరారు చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో గోపాలపురంలో ఈనెల 27న చంద్రబాబు బహిరంగ సభను లక్ష మందితో నిర్వహించనున్నారు. కాగా ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించింది. పార్టీలో ఎనలేని ఉత్సాహాన్ని నింపి క్యాడర్‌లో విజయోత్సాహాన్ని నింపింది. తిరిగి స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టై బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు మళ్లీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మూడు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తుండడం విశేషం.

సంక్రాంతికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, జనవరి 2: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రైలు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్ పరిధిలో సామర్లకోట మీదుగా పలు సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి సమాచారం అందింది. 07093 నంబరు గల సికింద్రాబాద్-బెరహమ్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 8,15 తేదీలలో రెండు ట్రిప్‌లు బయలుదేరనున్నాయి. ఈ రైలు సోమవారం సికింద్రాబాద్‌లో రాత్రి 7.45 నిమిషాలకు బయలుదేరి బుధవారం ఉదయం 6 గంటలకు బెరహమ్‌పూర్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో పిడుగురాళ్ళ, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి మీదుగా సామర్లకోటకు తెల్లవారుజామున 3.45కి చేరుకుని అన్నవరం 4.15కి చేరుకుని అనకాపల్లి మీదుగా బెరహమ్‌పూర్‌కు మంగళవారం ఉదయం 11.15కి చేరుకుంటుంది. 07094 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారంలో జనవరి 9,16లలో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి దువ్వాడకు సాయంత్రం 5.30కి చేరుకుంటుంది. అన్నవరానికి రాత్రి 6.23కి చేరుకుంటుందని, సామర్లకోటకు రాత్రి 7.08కి చేరుకుంటుందన్నారు. రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, పిడుగురాళ్ల మీదుగా సికింద్రాబాద్‌కు బుధవారం ఉదయం 6 గంటలకు చేరుకుంటుంది. 07272 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-సికింద్రాబాద్ మధ్య జనవరి 12న శుక్రవారం బయలుదేరనుంది. 07271 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-కాకినాడ మధ్య జనవరి 13న శనివారం బయలుదేరనుంది. మరిన్ని వివరాలకు, రైలు రిజర్వేషన్ టిక్కెట్లకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి సూచించారు.

నకిలీ ఏసీబీ అధికారి అరెస్టు

15 ఏళ్లుగా మోసాలు..ఉద్యోగులను బెదిరించి రూ.లక్షల్లో వసూలు

మండపేట, జనవరి 2: ఏసీబీ ముసుగులో మోసాలు చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మూడు రాష్ట్రాల్లో అతడిపై 100 పైగా కేసులు నమోదై ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడు రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మంగళవారం వివరాలు తెలిపారు. మండపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న వేంకటేశ్వరరావుకు గతేడాది డిసెంబరు 14న ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను ఏసీబీ అధికారిగా పరిచయం చేసుకుని 'మీరు రిటైర్‌మెంట్ దగ్గరలో ఉన్నారు, మీపై ఏసీబీ దాడి జరిగితే మీకు రావల్సిన బెనిఫిట్స్ రావు' అని బెదిరించి అతడి వద్ద నుంచి రెండు విడతలుగా రూ.3.5 లక్షలు నగదు కాజేశాడు. తర్వాత ఏఎస్ఐ తాను మోసపోయానని గ్రహించి డిసెంబరు 16న మండపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతపురం జిల్లా కదిరి నియోజకర్గ పరిధిలోని పట్నం మండలం మల్లికవేలమ గ్రామానికి చెందిన రాచంపల్లి శ్రీనివాసులు(వాసు) ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. 15 ఏళ్ల నుంచి ఇలా ఉద్యోగులే లక్ష్యంగా చేసుకుని ఏసీబీ ముసుగులో నేరాలకు పాల్పడుతున్నాడని డీఎస్పీ తెలిపారు. శ్రీనివాసులపై ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో కేసులు నమోదయ్యాయని, శిక్షలు కూడా అనుభవించాడని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో మండపేట రూరల్ ఎస్ఐ బళ్ల శివకృష్ణ తన సిబ్బందితో సీఐ శ్రీధర్‌కుమార్ సహకారంతో కర్నాటక రాష్ట్రం బెంగళూరు వెళ్లి అక్కడ పోలీసుల సహాయంతో బెంగళూరులో ఉంటున్న శ్రీనివాసులు కదలికలను గుర్తించారు. నిందితుడు శ్రీనివాసులు మంగళవారం ఉదయం రాజ మహేంద్రవరం రైల్వేస్టేషన్ నుంచి విశాఖకు వెళ్లేందుకు సమాయత్తమవుతున్న సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అతడిపై దాడి చేసి పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.2.5 లక్షలు నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి ఆలమూరు కోర్టుకు మంగళవారం హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. కోర్టు అతడికి రిమాండ్ విధించిందని తెలిపారు. నిందితుడు శ్రీనివాసులు డబ్బులు వసూలు చేసే విషయంలో చాలా తెలివిగా వ్యవహరించేవాడు. నేరుగా డబ్బును తన అకౌంట్‌లో కాకుండా ఇతర వ్యక్తుల అకౌంట్‌లోకి వేయమనేవాడు. ఆటోడ్రైవర్లను, రోడ్లపై చిరు వ్యాపారులతో మాట్లాడి డబ్బు అత్యవసరమని, తన ఫోన్ పనిచేయడం లేదని చెప్పి వారి ఖాతాల్లో డబ్బులు వేయించేవాడు. ఉద్యోగులు ఏసీబీ పేరిట వచ్చే ఫేక్ కాల్స్‌కు భయపడవద్దని నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని డీఎస్పీ కోరారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, ఎస్ఐ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం అధికారులపై కేసుల నమోదుకు చర్యలు'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: కృష్ణునిపాలెం భూసేకరణలో పోలవరం అధికారులపై కేసులు నమోదుకు చర్యలు చేపట్టారని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. రాజమహేంద్రపురం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో భూసేకరణ చేసినప్పటి నుంచి ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదని, ఆర్అండ్ఆర్ వర్తింపజేయలేదన్నారు. అసలు పట్టాదారులకు చట్టప్రకారం చెల్లించవలసిన భూమి నష్టపరిహారం వేరే వ్యక్తులకు చెల్లించారని దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించి ఈ అవకతవకలకు బాధ్యులుగా ఆరుగురు అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మాధవీలత నివేదిక సమర్పించారని వివరించారు. రాజమండ్రి రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన ఎం.జితేంద్ర, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు (భూసేకరణ), స్పెషల్ కలెక్టర్ సీహెచ్ భానుప్రసాద్, పోలవరం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన పీవీవీ గోపాలకృష్ణలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని వెల్లడించారు. అధికారుల చర్యల వల్ల నష్టపోయిన వారంతా ఎస్టీ కులస్థులు కనుక అధికారులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేసినందుకు ఐపీసీ 409, అసలు పట్టాదారులను మోసం చేసినందుకు ఐపీసీ 420 ప్రకారం కేసులు నమోదు చేయాలని బాధితులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. భూములు కోల్పోయిన అసలు పట్టాదారులకు చట్టప్రకారం నష్టపరిహారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వెంటనే చెల్లించాలని కోరారు. పట్టాదారుల వారసులు దిబ్బ శ్రీను, దిబ్బ రమణ, బంటుమిల్లి అచ్చియమ్మ, బంటుమిల్లి రాజేశ్వరి, గరుగుపల్లి జోగరావు, గరుగుపల్లి రాము, ఆదివాసీ మహాసభ కార్యదర్శి అరగంటి వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల 'శోభాయాత్ర'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5,6,7 తేదీల్లో గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వైభవంగా అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాజమహేంద్రవరం పురవీధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సభలకు సంఘీభావంగా అపుస్మా ఆధ్వర్యంలో చేపట్టిన తెలుగు భాషా వైభవ శోభాయాత్ర కంబాలచెరువు దండిమార్చ్ సెంటర్ నుంచి పుష్కరాలరేవు రాజరాజనరేంద్రుడు విగ్రహం వరకు సాగింది. యాత్రకు విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం చైతన్య విద్యాసంస్థల అధినేత చైతన్యరాజుతో కలిసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాత్మానంద మాట్లాడుతూ ఎన్నో భాషలున్నా తెలుగు భాషను మరువకూడదని, తల్లిని ఎలా గౌరవిస్తామో అమ్మభాషను అలాగే గౌరవించాలన్నారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తుండడం అభినందనీయమని, వాటిని స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి ప్రారంభిస్తారని, జయప్రదం చేయాలన్నారు. అనంతరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ ఎంతో మంది గవర్నర్లను, ప్రముఖులను ఆహ్వానిస్తూ నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చైతన్యరాజు మాట్లాడుతూ తెలుగు మహాసభల నిర్వహణకు గైట్‌లో ఏర్పాట్లు చేశామన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు మహాసభలకు టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో గైట్‌లో చతుర్వేద యజ్ఞం కూడా మొదలైందని, సభలను విజయవంతం చేయాలన్నారు. శోభాయాత్రలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రాజరాజ నరేంద్రుడు, నన్నయ, నారాయణ బట్టారకుల చిత్రాలను ఉంచారు. వేదపండితుల మంత్రాలు, ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ విద్యార్థుల బ్యాండ్ మేళం నడుమ అనేక మంది కవులు, సాహితీవేత్తలు, ప్రముఖుల ఫొటోలతో ప్రదర్శన చేశారు. రాజరాజ నరేంద్రుడు విగ్రహానికి రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, చిన్నవెంకన్నబాబు, ఆదిత్య డైరెక్టర్ ఎస్‌పీ గంగిరెడ్డి, మంతెన కేశవ రాజు, బైర్రాజు ప్రసాద్, తెలుగు మహాసభల సమన్వయ కర్త సునంద రమేష్, సుమేధ రాజు, అపుస్మా అధ్యక్షుడు సుంకవల్లి మురళీ, కళ్యాణ్‌రెడ్డి, పి.శివాజీ, పి.సురేష్, ఈసీ సభ్యులు రమేష్, గంగాధర్, ఫ్యూచర్ కిడ్స్ నవి, ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సలహాదారుడు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ళ వరప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, గౌరవాధ్యక్షుడు మండేల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం నగరంలో శోభాయాత్ర



శోభాయాత్రకు హాజరైన విద్యార్థులు, నగర వాసులు

రెప్పపాటులో..

ముగ్గురిని బలి తీసుకున్న కారు..ఇద్దరు మహిళలు, చిన్నారి మృత్యువాత



రమాదేవి



దివ్యప్రియ

దేవరపల్లి/ కొవ్వూరు/ రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 : రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. కుటుంబంలో విషాదం నిండిపోయింది. దేవరపల్లి మండలం బంధపురం వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంతో బంధువులు కన్నీటిసంద్రంలో మునిగిపోయారు. నూతన సంవత్సర వేడుకలను ఎంతో ఆనందంగా జరుపుకుని బయలుదేరిన ఆ కుటుంబం.. అంతలోనే విషాదంలో మునిగిపోయింది. చూస్తుండగానే ప్రమాదం జరిగిపోయింది.. మృత్యువు డివైడర్ దాటుకుని వచ్చి ముగ్గురిని మింగేసింది. హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ మాక్స్ సొసైటీ ఏరియా, లింగంపల్లి సంగారెడ్డి జిల్లా ఆర్కే రామచంద్రపురం అక్కాతమ్ముళ్లు తమ తమ కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు గత నెల 30వ తేదీన రెండు కుటుంబాలకు చెందిన 8 మంది తమ సొంత కారులో వైజాగ్‌లోని తమ్ముడి అత్తవారింటికి వచ్చారు. రెండు రోజుల పాటు ఆనందంగా గడిపారు. వైజాగ్ చుట్టుపక్కల ప్రాంతాన్నీ తిరిగి చూశారు. సెలవులు అయిపోవడంతో మంగళవారం ఉదయం 10 గంటలకు వచ్చిన కారులోనే హైదరాబాద్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం 2 గంటలు అవుతుంది.. ఎక్కడైనా ఆగి భోజనం చేద్దామని అనుకుంటున్నారు. అంతలోనే కృష్ణా జిల్లా నందిగామ నుంచి వైజాగ్‌కు వెళుతున్న కారు డివైడర్ దాటుకుని వేగంగా దూసుకొచ్చి హైదరాబాద్ వైపు వెళుతున్న కారును ఢీకొట్టింది.. అంతే ఆ క్షణంలో ఏం జరిగిందో తెలియదు.. రెండు కార్లు తుక్కుతుక్కు అయిపోయాయి. అటుగా వెళ్లే ప్రయాణికులకు ఏం జరిగిందో అర్థం కాలేదు.. వాహనదారులు కాసేపటికి తేరుకుని కార్ల దగ్గరకు వెళ్లి చూశారు. రెండు కార్లలో 11 మంది ప్రయాణిస్తుండగా అందరూ తీవ్ర గాయాలపాలయ్యారు.



ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సుభాష్ గౌడ్‌కు తీవ్రగాయాలు కాగా తల్లి రమాదేవి (50), భార్య దివ్యప్రియ(25) కొవ్వూరు ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మృతి చెందారు. కుమార్తె గనిష్క (19నెలలు) దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బావ మల్లికార్జున్, సోదరి స్వప్న, మేనల్లుడు విశ్వక్‌సాయి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డివైడర్ దాటుకుని వచ్చి ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న నందిగామకు చెందిన పాస్టర్ వేల్పూల విజయమోహన్, వేల్పూల సంజనీగ్రేస్, వేల్పూల రోహిన్, అమితశ్రీలు దేవరపల్లిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న వారు అంతా క్షేమంగానే ఉన్నారు. సంఘటన ప్రాంతాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం నుంచి తేరుకున్న సుభాష్ గౌడ్ తన కుటుంబీకులు ఎలా ఉన్నారని పలుమార్లు అడగడం కంటతడి పెట్టించింది. ఎందుకంటే అతనికి తన తల్లి, భార్య, కుమార్తె మృతిచెందారని తెలియదు. సీఐ అనసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నన్నయలో ప్లేస్మెంట్ డ్రైవ్

దివాన్‌చెరువు, జనవరి 2: ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధ, గురువారాలలో రెండు రోజులు ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జి.వి.కె.బయోసైన్సెస్ ఆర్గన్ లైఫ్‌సైన్స్ వారిచే నిర్వహిస్తున్న ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌కు ఉమ్మడిగోదావరి జిల్లాల్లో ప్రస్తుతం ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. రాతపరీక్ష ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్, హెచ్.ఆర్.రౌండ్ నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని జీవీకే బయోసైన్సెస్ ఆర్గన్ లైఫ్‌సైన్స్ సంస్థలో నెలకు రూ.27 వేల జీతంతో ఉద్యోగం కల్పిస్తారన్నారు. వివరాలకు విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌ను లేదా విశ్వ విద్యాలయం ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డిని సంప్రదించాలని తెలిపారు.

భారీగా ఎరువులు సీజ్

పి.గన్నవరం, జనవరి 2: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం శ్రీశ్రీనివాస జనరల్ ఏజెన్సీస్ ఎరువుల షాపుపై రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎరువులకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌కు గోడౌన్‌లో ఉన్న నిల్వలకు వ్యత్యాసం ఉండటంతో 10.600 మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.2,59,700 విలువ గల ఎరువులను సీజ్ చేసి సంబంధిత షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపుల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపినా, స్టాక్ నిల్వలు ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. తనిఖీల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారి కళ్యాణ్ సూర్యకుమార్, సిబ్బంది వీరబాబు, లోవరాజు ఉన్నారు.

14 వేల హెక్టార్లలో నష్టం

సీతానగరం, జనవరి 2: రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో పొగాకు పంట దెబ్బతిందని పొగాకు బోర్డు చైర్మన్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రఘుదేవపురంలో మంగళవారం ఆయన పొగాకు పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పొగాకు బోర్డు కేవలం రైతుల అవసరాలను గుర్తించి వారికి అనుకూలంగా ప్రభుత్వంతో చర్చించి పనులు చేయించడం తప్ప హామీలు నెరవేర్చే పరిస్థితి లేదన్నారు. పొగాకు రైతుల పరిస్థితి, పంట పాడైన విధానాన్ని ప్రయత్నలోపం లేకుండా అధికారులు, మంత్రుల వద్దకు తీసుకువెళ్లామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన రావడం లేదన్నారు. ఈ సందర్భంగా రైతుల తరఫున భారతీయ జనతాపార్టీ నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, పొగాకు బోర్డు సభ్యులు కాట్రగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు పొగాకు వేసిన తర్వాత అర్వెస్టింగ్ వరకు వచ్చిన పంట, అకాల వర్షాలకు దెబ్బతిందని, ఇప్పటికి ఈ ఏడాది మూడుసార్లు పంట వేశారని రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారన్నారు. రాజమహేంద్రవరం నుంచి పొగాకు బోర్డు తొలగించి దేవరాపల్లి బోర్డులో కలపడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, సబ్సిడీపై వచ్చే ఎరువులు కూడా రైతులకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆక్షన్ సూపరింటెండెంట్ జీఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సబ్సిడీపై ఎరువులు ఇవ్వడానికి బోర్డుకు అభ్యంతరం లేదని, కానీ రైతు కమిటీ సభ్యులు అంతదూరం వచ్చి ఎరువులు తీసుకువెళ్లే అవకాశం లేదని చెప్పడం వలన ఇవ్వడం లేదన్నారు. మండలాల్లోని సహకార సంఘాల ద్వారా ఎరువులు ఇచ్చే అవకాశం పరిశీలించాలని రైతులు కోరారు.

టెక్సాస్ నుంచి అమలాపురానికి మృతదేహాలు

ఎమ్మెల్యే పొన్నాడను ఓదార్చిన నాయకులు



ఎమ్మెల్యే పొన్నాడను ఓదార్చుతున్న మంత్రి వేణు

అమలాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని జాన్సన్ కౌంటీలో గల 67వ జాతీయ రహదారిపై గత నెల 26న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అమలాపురం పట్టణానికి చెందిన ఐదుగురు మృతిచెందడంతో వారి మృతదేహాలను మంగళవారం ఉదయం అమలాపురం తీసుకువచ్చారు. మృతులు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ చిన్నాన్న పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు కావడంతో పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఎమ్మెల్యే పొన్నాడ స్వగృహానికి మృతదేహాలను తరలించారు. వందలాది మంది అభిమానులు, రాజకీయ నాయకులు ఎమ్మెల్యే సతీష్ స్వగృహానికి తరలివచ్చి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సతీష్‌తో సహా కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. చిన్నారుల మృతదేహాలు సైతం అక్కడ చూపరులను కంటతడి పెట్టించాయి. కాగా జాన్సన్ కౌంటీలో ఉన్న 67వ నంబరు హైవేపై పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న వాహనాన్ని గత ఏడాది డిసెంబరు 26న ఓ ట్రక్కు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు స్వయానా చిన్నాన్న అయినా పొన్నాడ నాగేశ్వరరావు(68), అతని భార్య సీతామహలక్ష్మి (64), కుమార్తె పోతాబత్తుల నవీనగంగ(38), ఆమె కుమారుడు కృతిక్(11), కుమార్తె నిషిత(9) ప్రమాద స్థలిలోనే మృత్యువాత పడిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను అమెరికాలోని తానా సభ్యుల సహకారంతో సోమవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తీసుకుని వచ్చి అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్సుల్లో అమలాపురం తరలించారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ స్వగృహం వద్ద పెద్దసంఖ్యలో రాజకీయపార్టీల ప్రముఖులు, అభిమానులు మృతదేహాలను సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు వైసీపీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు నివాళులర్పించారు. అనంతరం రాజమహేంద్రవరంలోని కోటిలింగాల శ్మశాన వాటికకు మృతదేహాలను తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ నాగేశ్వరరావు అల్లుడు పోతాబత్తుల లోకేశ్ అమెరికాలో చికిత్స పొందుతున్నారు. నివాళులర్పించిన వారిలో వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి బాబు, దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, పెన్మెత్స చిట్టిరాజు, బిళ్ల మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

న్యాయం చేయలేని పోలీస్‌స్టేషన్లు ఎందుకు?

వృద్ధురాలిపై దాడి చేస్తే చర్యలు తీసుకోరా?

పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం



సీఐ శివగణేష్‌ను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, జనవరి 2: రంగంపేట మండలం సుబ్రహ్మంపేటలో వృద్ధురాలు ఆమె బంధువులపై జడ్పీటీసీ చేసిన దాడిపై నేటి వరకూ కనీసం విచారణ కూడా చేయలేదని అధికార పార్టీకి కొమ్ము కాస్తూ సామాన్యులకు న్యాయం చేయలేని పోలీస్ స్టేషన్లు ఎందుకని వాటికి తాళాలు వేయండి అంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 26వ తేదీన తనకు రుణం మంజూరు చేయలేదని అడిగిన వృద్ధ మహిళ వాడపల్లి నాగమణిపైన ఆమె కోడలిపైనా దౌర్జన్యానికి పాల్పడి రక్తం వచ్చేలా కొట్టిన జడ్పీటీసీ పేపకాయల రాంబాబుపై నేటికీ రంగంపేట పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి సీఐ శివగణేష్‌కు ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగి వారం గడుస్తున్నా కనీసం సంఘటనా స్థలంలో విచారణ కూడా చేయలేదని అధికార పార్టీకి కొమ్ము కాస్తూ సామాన్య ప్రజలను గాలికి వదిలేశారని రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తపై జడ్పీటీసీ రాంబాబు లైంగికంగా వేధింపులకు గురి చేసినా చర్యలు చేపట్టలేదని అన్నారు. ఎస్ఐపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే ఎంత దూరమైనా వెళతామని ప్రైవేటు కేసులు వేసి న్యాయస్థానంలో తేల్చుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్తి దేవ దానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి తదితరులున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

మోతుగూడెం, జనవరి 2: సీలేరు నుంచి విజయవాడకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను మోతుగూడెం ఎస్ఐ బి.గోపాలరావు, పోలీసు సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. విజయవాడ లబ్బీపేటకు చెందిన షేక్ ఫహీం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనమాక గ్రామానికి చెందిన చల్లా హరినాథ్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం బురగగూడెం గ్రామానికి చెందిన నందిపాటి వంశీ కృష్ణారెడ్డి గంజాయిని రహస్యంగా ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తున్నారు. మోతుగూడెం వద్ద వాహనాలను తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రూ.50 వేల విలువ చేసే పది కిలోల గంజాయి, ఏపీ37 బీప 0333 నంబరుతో ఉన్న స్కార్పియో కారు, ఏపీ07 సీఎక్స్ 3368 నంబరుతో ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ స్వాధీనం చేసుకున్నారు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7075656208
AJV_164615

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్లను / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. ఫోన్:8977639662, 8977639663 AJH1323

4 Lines CLASSIFIED Rs.230/- Only

ఏజెన్సీ సమాచారం



రాజవొమ్మంగిలో అంగన్‌వాడీల ఉద్దేశించి మాట్లాడుతున్న శివరామచంద్రరాజు

అంగన్వాడీల సమస్యలు చంద్రబాబు దృష్టికి తీసుకువెళతాం

- టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు శివరామచంద్రరాజు
- 22వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

రాజవొమ్మంగి, జనవరి 2: ఏజెన్సీలో అంగన్వాడీ వర్కర్ల సమస్యలను టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళతామని టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు అన్నారు. మంగళవారం కూడా రాజవొమ్మంగిలో అంగన్వాడీ వర్కర్లు నిరసన దీక్ష చేపట్టారు. అంగన్వాడీల దీక్ష శిబిరం వద్ద టీడీపీ నేతలు వారికి మద్దతు తెలిపారు. ఏజెన్సీలో అంగన్వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను టీడీపీ అధినేత చంద్రబాబుకు నివేదిస్తామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు మాట్లాడుతూ 22 రోజులుగా నిరసన దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. అలానే రాజవొమ్మంగి తెలుగుదేశం పార్టీ తరపున అంగన్వాడీ వర్కర్ల నిరసనలో అవసరాల నిమిత్తం ఐదువేల రూపాయలు ఇవ్వనున్నట్లు టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు చెప్పారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మరం విజయభాస్కర్, బరదనాంపల్లి సర్పంచ్ గొల్లపూడి లక్ష్మీదుర్గ, శరభవరం మాజీ సర్పంచ్ లోతా లక్ష్మణరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకట్

రంపచోడవరం: స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 22 వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కార్మిక, కర్షక ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నామన్నారు. అంగన్‌వాడీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరి విడనాడి కనీస వేతన జీవోను ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మోటారు పనిచేయక నీటికోసం అవస్థలు

- చందాలతో స్వచ్ఛందంగా పనులు చేసుకుంటున్నగ్రామస్థులు

రాజవొమ్మంగి, జనవరి 2: రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి పంచాయతీ సీతారామపురం గ్రామంలో గత నాలుగు నెలలుగా మోటారు పనిచేయక తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, పాలకులకు చెప్పిన స్పందించకపోవడంతో మంగళవారం గ్రామంలో యువకులు స్వచ్ఛందంగా మోటార్‌ను బయటకు తీసి, రిపేర్ చేయించేందుకు తీసుకువెళ్లారు. సుమారు 150 మంది నివసించే గ్రామంలో మోటార్ పనిచేయక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమని గ్రామస్థులు అంటున్నారు. తాము సొంతంగా చందాలు వేసుకొని పనులు చేసుకుంటున్నామని గ్రామస్థులు రాజు, అప్పలరాజు తెలిపారు.

బలవంతపు భూసేకరణను ఆపండి



మాట్లాడుతున్న సర్పంచ్ పులి సంతోష్‌కుమార్

వరరామచంద్రాపురం, జనవరి 2: మండలంలోని శ్రీరామగిరి గ్రామ పంచాయతీలోని చొక్కనపల్లి గ్రామంలో పోలవరం నిర్వాసితులకు భూమికి, భూమి ఇవ్వాల్సి ఉన్నా నిర్వాసిత రైతులకు నచ్చని భూమిని ప్రభుత్వం బలవంతంగా చూపించడం దారుణమని శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మండిపడ్డారు. విలేకర్లతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వీఆర్‌పురం తహశీల్దార్ బుట్టాయిగూడెం తహశీల్దార్ ఆధ్వర్యంలో నిర్వాసిత గిరిజన రైతులను తీసుకు వెళ్లి భూమి నచ్చలేదని చెప్పినా తీసుకోవాలని చెప్పడం దారుణమని అన్నారు. ఉన్నతాధికారుల మెప్పుకోసం నిర్వాసిత రైతులకు నచ్చని భూమిని కట్టబెట్టాలని చూడడం సరైన పద్ధతి కాదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు రైతులకు నచ్చిన భూములను ఇవ్వాలని అధికారులను కోరారు.

ఘనంగా సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవం



బాబాకి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

మోతుగూడెం, జనవరి 2: చింతూరు మండలం మోతుగూడెంలో శ్రీ సద్గురు ప్రసన్న సాయిబాబా 11వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన గురు బంధువులు శ్రీ సోమిన శివ ప్రసాద్ పర్యవేక్షణలో ఆధ్యాత్మిక సూచనలు పాటించారు. ఉదయం 5 గంటలకు బాబాకు కాగడ హారతి, 6 గంటలకు ఉత్సవ మూర్తులకు దత్తాత్రేయులకు పంచామృతాలతో అభిషేకం అనంతరం పరిమళ పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. ప్రధాన అర్చకులు వి.పవన్, సాయిభక్తులు పీటీ రామారావు, పప్పు విశ్వనాథం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. మట్టపర్తి సత్యనారాయణ, కొట్టు శ్రీనివాస్, మంచిశెట్టి కృష్ణభగవాన్, పి.ఆనంద్, బి.రాజేష్, టి.మూర్తి, ఎస్.నాయుడు, నరసింహమూర్తి, నాగేశ్వరరావు, రత్నాకర్ పాల్గొన్నారు.

స్టేట్‌మీట్‌లో గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

రంపచోడవరం, జనవరి 2: మన్యం జిల్లా పి.కోనవలసలో ఇటీవల గురుకులాల మధ్య జరిగిన స్టేట్‌మీట్‌లో గిరిజన గురుకుల పాఠశాల (బాలురు) విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే. అహ్మద్ అలీషా తెలిపారు. పి.చరణ్ 400, 1500మీ పరుగులో ద్వితీయ స్థానం, కె.నాగ చైతన్య హైజంప్‌లో ప్రథమస్థానం, కె.రాహుల్ లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రసాద్, పీడీ డి.ప్రసాదరాజు, పీఈటీ వి.చిన్నయ్య విద్యార్థులను అభినందించారు.

ఎస్టీయూ క్యాలెండరు ఆవిష్కరణ

రంపచోడవరం, జనవరి 2: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్‌ను సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ మంగళవానం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఎల్.వేణుగోపాల్, జి.నాగభూషణం పాల్గొన్నారు.



ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

సైకో పాలనను అంతమొందించాలి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



బిక్కవోలు: కొమరిపాలెంలో షూరిటీ బాండ్లను అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

బిక్కవోలు జనవరి 2: రాష్ట్రంలో ఐదు సంవత్సరాలుగా జరుగుతున్న సైకో పాలనను అంతమొందించేందుకు ప్రజలంతా ఎన్నికలకోసం ఎదురుచూస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బిక్కవోలు మండలం కొమరిపాలెంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, మహిళల సంక్షేమం కోసం చంద్రబాబు రూపొందించిన ఆరు పథకాలను అమలుచేసే విధంగా రూపొందించిన బాండ్లను ఆయన ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో బిక్కవోలు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

గోకవరం: రాష్ట్రంలోని ప్రజలందరికీ టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తోందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నబాబు అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం గ్రామంలో మంగళవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు, స్థానిక టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి ప్రజా వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వం తీరును వివరిస్తూ, టీడీపీ, జనసేన ప్రవేశపెట్టిన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండిగ బాలాజీ, కొంగరపు రాజు, మండిగ గంగాధర్, మండిగ చినబాలాజీ, రాపాక వీరబాబు, మండిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.



గోకవరం: కృష్ణునిపాలెంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఊపిరి ఫౌండేషన్ లోగో ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: కష్టాలో ఉన్న అభాగ్యులను ఆదుకునేందుకు, ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు సహకరం అందించేందుకు ఊపిరి ఫౌండేషన్ ఆసరాగా వుండాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్‌అన్నారు. స్థానిక 42వ డివిజన్‌లో టీడీపీ నాయకులు ఆదారి లక్ష్మీనారాయణ, భాగ్యలక్ష్మి దంపతులు ఏర్పాటు చేసిన ఊపిరి ఫౌండేషన్ లోగోను వారు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి మళ్ళ వెంకట్రాజు, ఉర్లంలక లోకేష్, దుద్దేటి నాగేంద్రయాదవ్, కేవీ శ్రీనివాస్, జగన్నాథం, వ్యాకెన్ నాగేంద్ర పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతి పత్రంతో
వినూత్న నిరసన

- 22వ రోజుకు అంగన్‌వాడీల నిరవధిక సమ్మె



రాజానగరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాజానగరం, జనవరి 2: న్యాయపరమైన తమ డిమాండ్లసాధన కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన నిరవధిక సమ్మె 22వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా మంగళవారం దీక్షా శిబిరం వదిలి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా అంగన్ వాడీ యూనియన్ నాయకులు పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం విరమించే ప్రసక్తి లేదన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తెలంగాణాకన్నా అదనంగా వేతనాలు పెంచాలని పెద్దఎత్తున నినదించారు. అనంతరం ప్రభుత్వ తీరుకు అనుగుణంగా పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని దున్నపోతుకు సమర్పించారు. ఈకార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ నాయకులు ఎం.మార్తమ్మ, సత్యనారాయణమ్మ, చంద్రమ్మ, గంగ పాల్గొన్నారు.

భారత విప్లవ కమ్యూనిస్టుపార్టీ
జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యేసు



అనపర్తిలో నిర్వహించిన ఆర్‌సీపీఐ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

అనపర్తి, జనవరి 2 : తూర్పుగోదావరి జిల్లా భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమావేశం మంగళవారం అనపర్తిలోని కోళ్ల రైతుల కళ్యాణ మండపంలో పార్టీ నాయకుడు బొత్స యేసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటుచేశారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్య దర్శిగా యేసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శిగా బంగారు ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా బి.అశోక్‌కుమార్, కె.నవీన్‌కుమార్, యు.గంగరాజు, తోట బెంజిమన్, ఎస్.కుమార్‌లు ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రంబాల సతీష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో మతోన్మాద పార్టీ బీజేపీకి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు యూటీఎఫ్ 12 గంటల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 : ప్రతినెలా 1వ తేదీనే జీతాలు చెల్లించాలని, పీఆర్‌సీ, డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర ఆర్థిక బకాయిల సాధనకోసం చేపట్టిన రాష్ట్రవ్యాప్త పోరాటంలో భాగంగా ఈనెల 3వ తేదీన రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట 12 గంటల పాటు ధర్నా నిర్వహిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ తెలిపారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ ఈ ధర్నా చేపడతామని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకతతో
టీడీపీలోకి చేరికలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: రాజమహేంద్రవరంలో కొంత మంది వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతో టీడీపీలోకి చేరారని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక 37వ డివిజన్‌కు చెందిన నిమిషకవి వెంకటేష్, 7వ డివిజన్‌కు గోరక్షణపేటకు చెందిన సేవారత్న జాతీయ అవార్డు గ్రహీత గంటసాల అశ్వినికుమార్ గుప్తాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారిని స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ కండువాలతో ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వివిధ పన్నుల రూపాల్లో భారాలు మోపి కంటితుడుపు చర్యగా అడపా దడపా పథకాలు అమల చేస్తున్నాడని అన్నారు. ప్రజలంతా టీడీపీ-జనసేన కూటమిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర యువత అధ్యక్షుడు ఉర్లంకల లోకేష్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారికి కండువా వేసి స్వాగతిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

స్వామీ వివేకానంద
జీవన సాఫల్య పురస్కారాలకు ఎంపికలు



వివేకానంద జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు చాగంటి కోటేశ్వరరావు, నల్లమిల్లి శివారెడ్డి, డాక్టర్ గోలి వేంకటరామారావు

వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత యిమ్మణ్ణి దీపా వెంకటస్వామి

అనపర్తి, జనవరి 2 : అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతియేటా పలువురు ప్రముఖులకు అందజేసే స్వామీ వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు 2024కు సంబంధించి పలురంగాలలో నిష్ణాతులైన నలుగురిని ఎంపిక చేసినట్లు రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. స్వామీ వివేకానంద జీవనసాఫల్య పురస్కారాలు 2024కు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, ప్రముఖ వైద్యులు గోలి వెంకట రామారావులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా స్వామీ వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డుకు స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ యిమ్మణ్ణి దీపా వెంకట్‌లను ఎంపనిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 24న అనపర్తి సమీపంలోని దుప్పలపూడిలో గల ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల నుంచి వీరికి అవార్డులతో పాటు జ్ఞాపిక రూ.25వేల నగదును అందించనున్నట్లు ఆయన తెలిపారు.

వైద్య రంగంలో దంత విద్యకు ఆదరణ

- రెడ్ క్రాస్ అసోసియేషన్ ఏపీ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ శేఖరరెడ్డి
- ఘనంగా జీఎస్ఎల్ దంతవైద్య కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథి శేఖరరెడ్డి, చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, జనవరి 2: వైద్య రంగంలో దంత విద్య రోజురోజుకు అధిక ప్రాధాన్యంను సంతరించుకుంటోందని సుప్రసిద్ధ డెంటల్ సర్జన్, రెడ్‌క్రాస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.శేఖరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారంరాత్రి జీఎస్ఎల్ డెంటల్ కళాశాల 2023-24 బ్యాచ్ ఫ్రెషర్స్‌డే, వైట్‌కోట్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణలో దంత వైద్యానికి ఉన్న ప్రాధాన్యంను డెంటల్ విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. వందకోట్ల రకాల బ్యాక్టీరియా నివసించే నోటిని శుభ్రంగా ఉంచుకోకపోతే హానికారిక, బాక్టీరియా విజృంభించి శరీరంలో ప్రతి అవయవాన్నీ ధ్వంసం చేసుకుంటూపోతుంద ని, ఈ ప్రాధాన్యంవల్లే అమెరికాలో అన్ని వైద్య విభాగాల కంటే దంత వైద్యం అగ్ర భాగాన నిలుస్తోందన్నారు. అనంతరం ఫ్రెషర్లకు వైట్ కోటులు(డాక్టర్ ఆప్రాన్)లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ గంటా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

జీఎస్ఎల్ దంతవైద్య కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో భాగంగా దంత వైద్య విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేసిన నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరించారు.

వైభవంగా ప్రారంభమైన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అనపర్తి, జనవరి 2: అనపర్తిలోని శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలు మంగళవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఉత్సవాలలో మొదటిరోజున ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి శిష్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన పంచరత్న కీర్తనల బృందగానం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వ్యాఖ్యాత మునిగంటి వెంకట్రావు సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనపై విశ్లేషణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత, మేడపాటి చెల్లారెడ్డి, కర్రి సాంబశివరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సురేష్‌శర్మ, మారెళ్ల గంగరాజుశర్మ, కొవ్వూరి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి బాలమురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: రాజమహేంద్రవరం లాలాచెరువు హౌసింగ్ బోర్డుకాలనీలో సహృదయ ఫౌండేషన్, రజనీకాంత్ రాజు సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా అన్నదానం చేశామని, జననీ మానసిక దివ్యాంగులకు భోజనాలు పెట్టామన్నారు. కార్యక్రమంలో గొర్రిపర్తి ప్రతాప్, కాశీ ప్రసాద్, పి.చిన్నబాబు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ

రంగంపేట, జనవరి 2: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ మూడువేల రూపాయలకు పెంచారని అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం రంగంపేట మండలంలో గల వడిశలేరు, రంగంపేట, పెదరాయవరం, చంద్రేడు గ్రామాల్లో నూతనంగా పెంచిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని వృద్ధులకు పెన్షన్లు పంపిణీ ఏశారు. పేపకాయల రాంబాబు, కొల్లాటి ఇశ్రాయేలు, బుల్లి వీర్రాజు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రవిశంకర్, శ్యామలావతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

రంగంపేట, జనవరి 2: మండలంలోని అచ్యుతాపురంలో సారా అమ్ముతున్న పేరూరి జాన్ అనే వ్యక్తిని అతనికి సారా సరఫరా చేసిన పేరూరి శ్రీనును మంగళవారం రంగంపేట ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశారు. వారివద్ద నుంచి 26 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మీ తెలిపారు. ఈ దాడులలో ఎస్ఈబీ ఎస్.ఐ. శేఖర్‌బాబుపాల్గొన్నారు.

జయహో బీసీకి తరలిరండి

- బొడ్డు వెంకట రమణచౌదరి



కోరుకొండ, జనవరి 2: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఈ నెల 4న మంగళగిరి కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న జయహో బీసీ క్యాంపైన్‌కు తరలిరావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకట రమణచౌదరి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల కమిటీలలోని బీసీ సభ్యులు, వివిధ బీసీ అనుబంధ సంఘాల కమిటీ సభ్యులతోపాటు ముఖ్యమైన బీసీ నేతలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పత్రికా ప్రకటనలో వెంకటరమణచౌదరి కోరారు.

బీసీలకు జగన్ చేసిన ద్రోహాన్ని వివరించేందుకే జయహో బీసీ

- టీడీపీ బీసీ సాధికార సమితి రూరల్ కన్వీనర్ కర్రి

రాజమహేంద్రవరంరూరల్, జనవరి 2: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలకు చేసిన ద్రోహాన్ని బీసీ వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో తెలియజేసేందుకే జయహోబీసీ సభను నిర్వహిస్తున్నామని టీడీపీ బీసీ సాధికార సమితి రూరల్ నియోజకవర్గ కన్వీనర్ కర్రీ అప్పలస్వామి తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన, విశ్వబ్రాహ్మణ కన్వీనర్ వీరమల్ల సత్తిబాబులు మాట్లాడారు. వైసీపీ విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్ విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ ఇస్తానని మోసం చేశారని ధ్వజమెత్తారు.

జగన్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: జగన్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ అన్నారు. విశాఖపట్నంలో గ్యాంగ్ రేప్ ఘటనపై ఆయన స్పందించారు. ఇలాంటి దారుణాలు రాష్ట్రంలో ఎక్కడా జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వం మహిళలకు పూర్తి భరోసాను, ధైర్యాన్ని ఇవ్వలేకపోయాయని అన్నారు. బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని నిదింతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తే మహిళకు కొండంత అండగా వుంటామని రక్షణ చర్యలు కూడా కఠినతరం చేస్తారని చెప్పారు.

మున్సిపల్ సమ్మెకు సిద్ధంకండి

- ఏఐటీయూసీ జిల్లా నాయకులు పిలుపు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2: మున్సిపల్ కార్మికులకు సీఎం జగన్ ఇచ్చిన హామీల అమలుకు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 3వ తేదీ నుంచి సమ్మెకు మున్సిపల్ కార్మికులు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు తాటిపాక మధు, కూండ్రపు రాంబాబు అన్నారు. సమ్మె పిలుపులో భాగంగా మంగళవారం రాజమహేంద్రవరం దానవాయిపేట, జాంపేట, అప్సర సెంటర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఇతర డిమాండ్ల సాధన కోసం జనవరి 3 నుంచి సమ్మె ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంగిరెడ్డి రమణ, దుర్గమ్మ, అల్లం వెంకటేశులు, బంగారు నాగేశ్వరావు, ముత్యాలు మురళి పాల్గొన్నారు.

నర్సాపురంలో దుర్గమ్మ జాతర



నర్సాపురంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న జనసేన పార్టీ నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి

కోరుకొండ, జనవరి 2: కోరుకొండ మండలం నర్సాపురం గ్రామంలో సీతమ్మ చెరువుగుట్టవద్ద దుర్గాదేవి ఆలయంలో జనసేన పార్టీ నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమంలో జనసేనపార్టీ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, పలువురు జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సీసీఎస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డిపో మేనేజర్ రామన్న

గోకవరం, జనవరి 2: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల సీసీఎస్ డైరీని మంగళవారం డిపో మేనేజర్ యు.రామన్న ఆవిష్కరించారు. ఉద్యోగుల పొదుపు సంఘం డెలిగేట్ అప్పాజీ డైరీని మొదటిగా డీఎంకు అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు డిపోలో పనిచేసే ఉద్యోగులకు, కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ డైరీలు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ ఫైడమళ్ల లక్ష్మణరావు, నాయకులు ప్రగడ ప్రసాద్, అక్కిరెడ్డి కృష్ణ, చీకట్ల వెంకటేష్, నల్లా వీరబాబు పాల్గొన్నారు.







రెప్పపాటులో..

- డివైడర్ దాటుకొచ్చిన మృత్యువు
- కారు ఢీకొని ముగ్గురు మృతి
- బంధవుపురం వద్ద విషాదఘటన

7వ పేజీ, మెయిన్‌లో

అధినేతలు..ఆగయా

కాకినాడకు నేడు జగన్.. రేపు పవన్.. - 8లో


10న తునికి చంద్రబాబు రాక.. 20న మండపేట, 27న గోపాలపురంలో బాబు బహిరంగ సభలు

జగన్.. ఝలక్!

- రాజమహేంద్రవరం వైసీపీకి కొత్త అభ్యర్థులు
- సిటీకి ఎంపీ భరత్, రూరల్‌కి మంత్రి వేణు
- నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియామకం
- వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన
- డా.గూడూరి, చందన అవుట్
- హర్షకుమార్‌తో చందన మంతనాలు?

రాజమహేంద్రవరం, జనవరి2(ఆంధ్రజ్యోతి) : ఇంతకాలం పార్టీని నడిపించిన వారికి జగన్ ఝలక్ ఇచ్చారు.. తూర్పుగోదావరి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలకు కొత్తవారికి కేటాయిం చారు. దీంతో ఇప్పటి వరకూ ఆయా నియోజకవర్గాల్లో పార్టీని నడిపించిన నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం ఎంపీగా ఉన్న మార్గాని భరత్ రామ్‌ను సిటీ నియోజకవర్గానికి పంపించింది. రామ చంద్రపురం ఎమ్మెల్యేగా నెగ్గి ప్రస్తుతం మంత్రిగా ఉన్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి బదిలీ చేసింది. నియోజకవర్గ సమన్వయకర్తల పేరుతో వీరి పేర్లను వైసీపీ కేంద్రకార్యాలయం మంగళవారం ప్రకటించింది. మంత్రి వేణు, ఎంపీ భరత్ కూడా అయిష్టంగానే ఈ స్థానాలకు వస్తున్నట్టు ప్రచా రం జరుగుతోంది.వీరి రాకతో ఇప్పటి వరకూ సిటీ ఆకోర్డినేటర్‌గా ఉన్న డా.గూడూరి శ్రీనివాసరావు, రూరల్ కోఆర్డినేటర్‌గా ఉన్న చం దన నాగేశ్వర్ వారి స్థానాల నుంచి అవుట్ అయ్యారు. అయితే ఇంకా వారిని వైసీపీ నేతలు మభ్యపెడుతుండడం గమనార్హం. పైకి తేలడంలేదు.కానీ బీసీ సామాజికవర్గానికి చెందిన చందన కుటుంబం తీవ్ర అసంతృప్తికి లోనైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత నాలుగున్నరేళ్లుగా ఎంతో డబ్బు ఖర్చుపెట్టి.. పార్టీని కాపాడుకుంటూ వస్తే చివరికి దగా చేసినట్టు వాపోతున్నట్టు తెలిసింది. ఈ నేప థ్యంలో రెండు రోజుల కిందట మాజీ ఎమ్మెల్యే చందన రమేష్, ఆయన తనయుడు, చందన నాగేశ్వర్ కలసి హర్షకుమార్‌తో చాలా సేపు ఈ విషయాలనే చర్చించినట్టు తెలిసింది. వారు ముగ్గురు ఉన్న ఫోటో ఒకటి బయటకు కూడా వచ్చింది. ఈ పరిస్థితులు ఏ పరి ణామాలకు దారితీస్తాయనేది చర్చనీయాంశమైంది. డా. గూడూరి శ్రీనివాసరావుకు ఎంపీ ఇస్తారని చెబుతున్నట్టు ప్రచారం జరిగింది. ఇది వాస్తవం కాదని కొందరు చెబుతున్నారు. ఇక సిటీలో మార్గాని భరత్, రూరల్‌లో చెల్లుబోయిన వేణు కొన్ని సవాళ్లను ఎదుర్కోక తప్పని పరిస్థితి. సిటీలో భరత్‌కు వ్యతిరేక వర్గాలు ఎక్కువగా ఉన్నాయి. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణం వ్యతిరేకంగా ఉన్నారు. రుడా చైర్మన్ పదవి చేతికి మళ్లీ దక్కినట్టే దక్కి చేజారిపోవడానికి ఎంపీ భరత్ కారణమనే ఆగ్రహంతో రుడా మాజీ చైర్‌పర్సన్ మేడ పాటి షర్మిళారెడ్డి, ఆమె భర్త అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. రూరల్‌లో సీటు దక్కకపోవడంతో చందన నాగేశ్వర్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే, అసలే రూరల్ ఇబ్బందిలో ఉన్న వైసీపీకి కష్టాలే. అంతేకాక రెండు స్థానాలకు కొత్త అభ్యర్థులను బదిలీ చేయడం పట్ల స్థానికంగా టికెట్లు ఆశించేవారు కూడా అసహనానికి గురవుతున్నారు. వారి స్థానాలు వారికి ఉంచి, కొత్తవారికి ఇస్తే మంచిదనే వాదన ఉంది. కానీ చివరకు వైసీపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంతో కొందరు పార్టీలు కూడా మారే అవకాశాలు లేకపోలేదు.


ఇన్



వేణు

భరత్

అవుట్



చందన

గూడూరి



ఉరి వేసుకుని సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన ప్రదర్శన

మాకు ఉరేసే సరి!

జగన్ మాటలు నమ్మినందుకు మాకిదే శిక్ష

రాజమహేంద్రవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సందర్భంగా జగన్ మాటలు నమ్మినందుకు ఉరే గతి అని సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, జగన్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా 14వ రోజైన మంగళవారం ఉద్యోగులు మెడకు ఉరితాడు బిగించు కొని తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. భవిత కేంద్రాల్లో ఎంతో ఓర్పు, నేర్పుతో దివ్యాంగ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులపై ప్రభుత్వ తీరు సరికాదని భవిత కేంద్రాలకు తమ పిల్లలను పంపిస్తున్న కొప్పర్తి పద్మ, అడ్డారి వినీత, గోపీలీలా భవానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులతో సామరస్య వాతావరణంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అనపర్తి మండల ప్రైవేటు పాఠశాలల సంఘ అధ్యక్షుడు ఎస్.నాగార్జున డిమాం డ్ చేశారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించడం ప్రభుత్వానికి క్షేమకరం కాదని, ఉద్యమం ఉధృతం చేస్తామని ఎం.రఘునాథ్, డి.వంశీకృష్ణంరాజు, పి.దుర్గాప్రసాద్ తదితరులు తెలిపారు.

సైబర్ నేరాలపై డయల్ 1930

రాజమహేంద్రవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరా లు, గంజాయి వల్ల దుష్పరిణామాలపై విద్యార్థులకు తరచుగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఏఎస్పీ జి.వెంక టేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల ప్రధానో పాధ్యాయులు(ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు)ప్రతినిధుల తో ఆయన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చెడుదారి పట్టకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ అనవసర లింక్‌లను క్లిక్ చేస్తే అన ర్థాలు తప్పవన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, చాటింగ్ వంటి వాటికి దూరం గా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనపుడు వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, యాజ మాన్యాలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ జనవరి2: ప్రజా ఆరోగ్యానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రజలకు ఆరోగ్య భరోసా క ల్పించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ మాధవీలత పేర్కొ న్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులో ని ర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం సంద ర్శించారు. ఒకటో విడతలో 441 వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామ న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారంలో రెండు సా ర్లు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి బుధవారం వైద్య శిబిరాలు ఏర్పా టు చేయడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, గతం లో డాక్టర్లు సూచించిన కేస్ షీట్, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి త దితర అంశాలను పరిశీలించారు. అనంతరం కంటి వెలుగు పథకంలో భాగంగా కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమం లో డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, తహశీల్దార్ చి న్నారావు, గ్రామ కార్యదర్శి రాణి తదితరులు పాల్గొన్నారు.

బంకుల వద్ద..క్యూ

పెట్రోలు కొరతంటూ వదంతులే కారణం

రాజమహేంద్రవరం,జనవరి 2(ఆంధ్రజ్యోతి): పెట్రోలు, డీజిల్ సరఫరా డీలర్లు,ట్యాంకర్ల యజమానులు సమ్మెకు దిగుతున్నారనే వార్తలు వ్యాపించడంతో బంకుల వద్ద వాహన దారులు భారీగా క్యూ కట్టారు. జేబులో ఉన్నదంతా తీసి ట్యాంకులు ఫుల్ చేయించేశారు.ఎందుకని ఆరా తీస్తే.. హైద రాబాద్‌లో పెట్రోలుకు కొరత ఏర్పడిందనే వార్తలు వ్యాపిం చడంతో మధ్యాహ్నం నుంచి బైక్‌లు, కార్లు పెద్ద సంఖ్యలో బంకుల వద్దకు చేరుకోవడం, పంజాగుట్ట నుంచి మాదాపూర్ వరకూ ట్రాఫిక్ నిలిచిపోయిన విషయం న్యూస్ చానెళ్లలో రావడంతో జిల్లాలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. పలు బంకుల వద్ద వాహనదారులు క్యూకట్టారు. కొన్ని బంకుల వద్ద బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. లూజు విక్రయదా రు లు పెట్రోల్ అమ్మకాలు నిలిపివేశారు.అయితే, జిల్లా పౌర సరఫరాల అధికారిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇవన్నీ వదంతులని కొట్టిపారేశారు.అలాంటి సమ్మె ఏమీ తమ దృష్టికి రాలేదని, ఒకవేళ ఉన్నా ఇంధన నిల్వలకు ఇబ్బంది కలిగే అవ కాశం లేదని.. కంగారు పడవద్దని చెప్పారు.

పండుగకు.. ఫుల్!



రైళ్లలో చాంతాడంత వెయిటింగ్ లిస్ట్

- అన్నిరైళ్ల రిజర్వేషన్లు ఫుల్‌గా..
- గౌతమికి నిల్, గోదావరికి 13న 398..
- 200 దాటిన వందేభారత్
- అటూ ఇటూ ప్రయాణ యాతనే
- ఇప్పటి నుంచే పండుగ రద్దీ
- 19 వరకూ వెయిటింగ్ లిస్టే
- ఇంటర్ సిటీలు వేయాలని వేడుకోలు
- ఆర్టీసీ రిజర్వేషన్లూ ఫుల్
- సంక్రాంతికి 45 ప్రత్యేక బస్‌లు
- ప్రైవేటు బస్సులు దోపిడీ షురూ
- చార్జీలు పెంచేసిన వైనం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండక్కి ప్రయాణ నరకం తప్పేట్లు లేదు. ఇప్పటికే రైళ్లలో వెయిటింగ్ లిస్టు చాంతాడును మించి పోయింది.ఏసీ తరగతులదీ అదే పరిస్థితి. మరోవైపు పం డుగ సందర్భంగా ఆర్టీసీ వేసిన ప్రత్యేక బస్సుల్లోని రిజర్వే షన్లూ నిండుకున్నాయని సమాచారం. ఇదే అదనుగా ఎప్పటి మాదిరిగానే ప్రైవేటు బస్సులు చార్జీల బాదుడు మొదలు పెట్టేశాయి. ఆంధ్రాలో సంక్రాంతి పెద్ద పండుగ. సుదూర ప్రాంతాల్లో ఉన్నవాళ్లు ఎంతో ఉత్సాహంగా తమ సొం తూళ్లకు, బంధువుల ఇంటికి వస్తుం టారు. పైగా సంక్రాం తిలో గోదావరి జిల్లాలకు రావడానికి తహతహ లాడుతుంటారు.ఈ మూడు రోజుల కోసం ఏడాదంతా ఎదురు చూసే వాళ్లూ ఉన్నారు.ఎందుకంటే పెద్ద పండు గకు గోదారి జిల్లాలంటే ఠక్కున కోళ్ల పందేలు గుర్తొ స్తాయి.డూడూ బసవన్నలు,రంగవల్లికలు, జాత రలు, ఆటపాటలు, పచ్చని ప్రకృతితో ఈ జిల్లాలు కొత్త అందా లను సంతరించుకుంటాయి.అందుకే హైదరాబాద్ నుంచి కాకి నాడ, రాజమండ్రి, విశాఖ వైపు సంక్రాంతికి ఉన్నంత ప్రయాణ రద్దీ మిగతా రోజుల్లో ఉండదు. రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా సాధారణ రోజుల్లో రోజుకు 10 వేల మంది వరకూ రాకపోకలు సాగిస్తుండగా ఆ మూడు రోజుల ముందు వెనుకా సంఖ్య 20 వేలకు చేరుపోతుంది.

రైళ్లలో రిజర్వేషన్లు నిల్

కొంతకాలం నుంచీ మరమ్మతుల పేరుతో పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేస్తూ చిన్న సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. దీంతో ప్రతి రైళ్లలోనూ స్లీపర్ క్లాసు కూడా జనరల్ బోగీలను తలపిస్తోంది. ఏసీ బోగీలు నిండిపోతున్నాయి. రాజమండ్రి గుండా గతంలో 100 రైళ్ల వరకూ రోజువారీ, బైవీక్లీ, ట్రైవీక్లీ రైళ్లు నడిచేవి. ఇప్పుడు ఆ సంఖ్య అమాంతం సుమారు 30కి పడిపోయింది. దీంతో సాధారణ రోజుల్లో సైతం రిజర్వేషన్లు దొరకడం కష్టమవుతోంది. ఇక పండుగ ప్రయాణానికి వస్తే(2వ తేదీ సాయంత్రం సమయానికి చూస్తే) 11,12,13 తేదీల్లో ప్రత్యేక రైళ్లతో సహా అన్ని రైళ్లలోనూ రిజర్వేషన్లు నిండు కున్నాయి. స్లీపర్‌తో పాటు ఏసీ తరగతుల వెయిటింగ్ లిస్ట్ కూడా ఎక్కువగానే ఉంది. తిరుగు ప్రయాణంలో 16, 17, 18, 19 తేదీల్లోనూ అదే పరిస్థితి ఉంది. హైదరాబాద్ నుంచి ఎక్కువగా ఇటువైపు ప్రాంతాలకు జనాలు రాక పోకలు సాగించే విశాఖ,ఎల్‌టీటీ, గౌతమి, గరీబ్‌రథ్, కోణా ర్క్, ఫలక్‌నుమాకు 11,12, 13న రిజర్వేషన్లు ఫుల్ అయి పోయాయి.వెయిటింగ్ లిస్ట్ కూడా లేవు. గోదావరికి 11, 12న రిజర్వేషన్లు అయిపోగా 13న వెయిటింగ్ లిస్ట్ 398 ఉంది. థర్డ్ ఏసీ కూడా వెయిటింగ్ లిస్ట్ 190 దాటిం ది. ఈస్ట్‌కోస్ట్ 11న 307, 12న 386, 13న 320 వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నాయి. జన్మభూమిలో కూడా సెకండ్ సిట్టింగ్ 11, 12, 13న లేవు. 14న వెయిటింగ్‌లిస్ట్ 142 ఉంది. ఏసీ చైర్‌కార్ బోగీల్లోనూ వెయిటింగ్ లిస్టే. స్పెషల్ రైళ్లు 07446 11, 13న రిజర్వేషన్లు ఫుల్. 11న 07653లో స్లీపర్ వెయిటింగ్ లిస్ట్ 212, 08580లో 286 ఉంది.వారానికి రెం డుసార్లు నడిచే నాందేడ్-విశాఖకు 11న వెయిటింగ్ లిస్ట్ 290కి చేరింది. వందేభారత్‌లో 11న 203, 12న 309, 13న 257 వెయిట్‌లిస్ట్ ఉంది. 11న అమావాస్య అయి నప్పటికీ రైళ్లలో రద్దీ తారస్థాయికి చేరుకోవడం గమనా ర్హం. ఇక, తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్లడానికి గౌతమి 16న 184, 17న 354, 18న 238తో, ఈస్ట్‌కోస్ట్ 23 వరకూ వెయిట్‌లిస్టే ఉంది. గోదావరి స్లీపర్ వెయిట్‌లిస్ట్ 250 దాటగా, థర్డ్‌ఏసీ 150 దాటింది. గరీబ్ రథ్‌కి, జన్మ భూమి, కోకనాడ,విశాఖ రైళ్లకూ వెయిట్‌లిస్ట్ పరుగులు పెడు తోం ది. ఇదిలా ఉండగా పండుగల్లో హైదరాబాద్ నుం చి విజయవాడ,రాజమండ్రి,విశాఖకు రానుపోను ఇంటర్ సిటీ రైళ్లను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనివల్ల రైల్వేకు అదనపు ఆదాయం సమకూరుతుందంటున్నారు.

ఆర్టీసీదీ అదే రూటు

హైదరాబాద్ నుంచి సాధారణ రోజుల్లో ఉన్న సర్వీ సులతో పాటు 45 సర్వీసులను పండుగకు ప్రత్యేకంగా వేశారు.వాటికి 90 శాతం సీట్లు ఇప్పటికే బుక్ అయిపో యాయని తెలుస్తోంది. ఇంకా అదనపు సర్వీసులు వేసే అవకాశంపై ఆలోచన చేస్తున్నారు. టీఎస్‌ఆర్టీసీ 4 సర్వీసు లను నడుపుతోంది. ఆర్టీసీలో కూడా ప్రయాణానికి దారి కానరాకపోవడంతో ప్రైవేట బస్సులను ఆశ్రయించక తప్ప ని పరిస్థితి ఉంది. ఇదే అదనుగా చార్జీలను బాదేసే దారి పట్టారు.ప్రైవేటు బస్సుల్లో హైదరాబాద్ నుంచి రాజ మం డ్రికి పండుగ రోజుల్లో నాన్ ఏసీ సీటర్/స్లీపర్ బస్సులకు రూ.1400 నుంచి 2500 వరకూ రేటు పెట్టారు. 11న ఏసీ స్లీపర్ కొన్ని బస్సులకు రూ.3 వేల నుంచి రూ.3500 ఉం ది.ఇక బాత్‌రూంలు బస్సులోనే ఉండే ఏసీ స్లీపర్ ఇంటర్ సిటీ స్మార్ట్ బస్‌లకు టికెట్ ధర ఏకంగా రూ.4500 ఉంది. అంటే భార్యా, భర్త, ఇద్దరు పిల్లలు ఈ బస్సులో వచ్చి వెళ్లడానికి అక్షరాలా రూ.36 వేలు సమర్పించుకోవాల న్నమాట.దీంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

కొత్త పేరుతో.. పాత దొంగలు

- యథేచ్ఛగా సా..గుతున్న ఇసుక దోపిడీ
- ప్రతిమా కనస్ట్రక్షన్‌తో ఒప్పందం
- ర్యాంపులు ఖరారు కాకుండానే తవ్వకం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఇసుక వ్యాపారానికి కొత్త కాంట్రాక్టు సంస్థ వచ్చింది. కానీ అధికారులు ఇంకా ర్యాంపులు అప్పగించకుండా కొత్తపేరుతో పాత దొంగలు ఇసుక దోపిడీ చేసేస్తున్నారు. జేపీ సంస్థకు గత మే నెలలో కాంట్రాక్టు సంస్థ గడువు ముగిసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అనా మకుల పేర్లతో ర్యాంపులు నడచిపోతు న్నాయి. కానీ పాత బిల్లులే ఇచ్చారు. దీనిపై ఎంత మంది గోడుపెట్టినా ఎవరూ పట్టించుకోలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం కొత్త కాంట్రాక్టు సంస్థను తెరమీదకు తెచ్చింది. ప్రతిమా కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేర ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పుగోదావరి, కాకి నాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఇసుక వ్యాపారమంతా ఈ సంస్థకే అప్పగించారు.కానీ జిల్లాలో ఇంకా ఈ సంస్థకు గోదావరి ఇసుక ర్యాంపులు అప్పగించలేదు. సీతానగరం మండలం ముని కూడలి తదితర ప్రాంతాల్లో ప్రతిమా కన్‌స్ట్రక్షన్ పేర ఉన్న బిల్లుతో ఇప్పటికే తవ్వేస్తున్నారు. అధికారులేమో అసలు ఆ ర్యాం పులకు అనుమతులు లేవని చెబుతున్నారు. అఖండగోదావరిలో డీ సిల్టేషన్‌కు గత నెల 27తో గడువు ముగిసింది. తిరిగి ఇంకా అనుమతివ్వలేదు. కానీ గాయత్రి, కాతేరు, వెంకటనగర్ ర్యాం పుల్లో రాత్రీపగలూ డ్రెడ్జింగ్ చేస్తున్నారు. పబ్లిక్‌గా ఇసుక అమ్మేస్తున్నారు.రూ.కోట్లు దోపిడీ చేస్తున్నారు. వాస్తవానికి ప్రతి మా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇసుక వ్యాపారానికి వచ్చిందని అధికా రులు చెబుతున్నారు.వారికి 25 ర్యాంపుల వరకూ అప్పగించ డానికి జిల్లా స్థాయి ఇసుక కమిటీలో నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.ఇంకా ఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారుల వద్ద జాబితా పెండింగ్‌లో ఉంది.డీ సిల్టేషన్‌కు కూడా అనుమతి లేదు.ఈ పరిస్థితుల్లో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

సీజ్ చేసిన ఇసుకా బేరమే..

గతంలో కోటిలింగాల రేవు ప్రాంతాల్లో అక్రమంగా తవ్వుకున్న ఇసుకను కాతేరు ప్రాంతంలో ఓ విద్యాసంస్థ సమీపంలో స్టాక్ పెట్టారు. దానిపై ఫిర్యాదులు రావడంతో సీజ్ చేశారు. అప్పట్లో ఫైన్ కూడా వేసినట్టు ప్రచారం జరిగింది.కొందరు నేతల ఒత్తిడి వల్ల ఈఫైన్ రద్దు చేయించు కోవడానికి వేరే బిల్లులు సమర్పిం చినట్టు సమాచారం.అధికారులు ప్రస్తుతం ఈ బిల్లులు పరిశీలి స్తున్నామని చెప్పారు.

కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
Together We Can
కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి
ABN

జిల్లా ముగ్గుల పోటీల స్పాన్సర్:



ఆదిరెడ్డి అప్పారావు దంపతులు
ఆదిరెడ్డి వాసు, భవానీ దంపతులు
భవానీ చారిటబుల్ ట్రస్ట్
రాజమహేంద్రవరం

సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించే కేంద్రం:
తూర్పుగోదావరి జిల్లా :
పోటీ జరిగే తేదీ : 6 శనివారం, జనవరి 2024
ప్రదేశం : షిరిడీ సాయి జూనియర్ కాలేజీ,
రిలయన్స్ డిజిటల్ ఎదురుగా, జేఎన్ రోడ్, రాజమహేంద్రవరం
ముత్యాల ముగ్గు పోటీలకు మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నెం: 99854 11248

ముగ్గుల పోటీ నిబంధనలు
1. మహిళలు మాత్రమే పాల్గొనాలి.
2. ముగ్గు, రంగులు, పువ్వులు, ఇతరత్రా సామాగ్రి స్వయంగా తెచ్చుకోవాలి.
3. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి.
4. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు అనేవి చెప్పాలి.
5.ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు.
6. న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం.
7. ముగ్గును చేతితోనే వేయాలి. గొట్టాలు, జల్లెలు వంటి ఉపయోగించి వేయకూడదు. జల్లెడ మాత్రం ఉపయోగించవచ్చు.
8.ముగ్గుల్లో గొబ్బెమ్మల వంటివి అమర్చవచ్చు. ఇతరత్రా వస్తువులు ఎక్కువగా అమర్చ కూడదు. ముగ్గుకు అందం ఇవ్వడానికి ఇతర వస్తువులు వాడాలి తప్పితే ఆ వస్తువులనే ప్రధానాంశంగా చేసుకోకూడదు.

మొదటి బహుమతి రూ.6000/-
రెండో బహుమతి రూ.4000/-
మూడో బహుమతి రూ.3000/-

కెనరా బ్యాంక్ Canara Bank
సంతోషాల వసంతం, మీ ముంగిట
కెనరా గృహ ఋణం 8.40%
కెనరా వాహన ఋణం 8.70%
www.canarabank.com 1800 1030

Powered By
AIMS INSTITUTES Peenya, Bangalore
PROGRAMMES OFFERED
MBA | MBA In France | PGDM | BBA | BBA (Aviation)
BCOM | MCOM | MFA (Financial Analysis) | DIPLOMA Swiss Professional Diplomas in Hospitality (Culinary / Food & Beverage / Rooms service)
BCA | MCA | BHM
MSW | PUC (PCMB/PCMC/CEBA)
AIMS Institutes: 1st Cross, 1st Stage, Peenya, Bangalore
AIMS Admissions Centre +91 81500 01994
www.theaims.ac.in/apply admission@theaims.ac.in

Real Partner
SWARGASEEMA SUKETANA
DTCP APPROVED
TS RERA P014000006315
KONDURG @SHADNAGAR (HYDERABAD)
DTCP & RERA APPROVED PLOTS
Ph: 9849012500
CALL US FOR FREE SITE VISIT

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నేటి నుంచి మున్సిపాలిటీల్లో అన్ని పనులు బంద్

మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు



కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మెచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కొవ్వూరు, జనవరి 2: పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేని పక్షంలో మున్సిపల్ అత్యవసర విభాగాల కార్మికులను కలుపుకుని బుధవారం నుంచి మున్సిపాలిటీలలో అన్ని పనులు బంద్ చేస్తామని మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తెలిపారు. వారు మంగళవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట 8వ రోజు నిరవధిక సమ్మెను చేపట్టారు. కార్మిక సంఘ నాయకులు రాజాన అప్పారావు, మీసాల కిషోర్ మాట్లాడుతూ ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో పూజారి వాసు, భూపతి రవీంద్ర, కళ్యాణి రాజేష్, మీసాల ప్రేమ్, ఎం.జ్యోతి, క్షేత్రప్రసాద్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పాల్గొన్నారు.

నిడదవోలులో న్యాయవాదుల రిలే దీక్షలు



నిడదవోలులో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న న్యాయవాదులు

నిడదవోలు, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తక్షణం ఉప సంహరించుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ములగాల రవికుమార్ అన్నారు. మంగళవారం నిడదవోలులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బయట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14వ రోజు రిలే నిరవధిక దీక్షలు నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం భూకబ్జాదారులకు పూర్తిగా అనుకూలంగా ఉందని, దీని వల్ల సన్న, మధ్యకారు రైతులకు తీవ్రనష్టం వాటిల్లనుందని, ప్రభుత్వం స్పందించి ఈ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో మహమ్మద్ మెహబూబ్, కారెం చిట్టిబాబు, ఉజ్జిన ప్రసన్న, బట్టు రాజు, పాతగొలుసు ఓబాధ్య, సరిదే భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో భారీ అన్నసమారాధన

తాళ్లపూడి, జనవరి 2: మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు శింహాద్రి జనార్దనరావు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా ఆలయం వద్ద ప్రతి మంగళవారం అన్నదానం జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు సొలస గిరిధరగాంధీ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎమ్మెల్యే తలారి

వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సంబరాలు ప్రారంభం



వేళ్లచింతలగూడెంలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం, జనవరి 2: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్యాటింగ్ చేయగా మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బౌలింగ్ చేసి పోటీలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారిద్దరూ ఆర్ఎం ఫౌండేషన్ అధినేత గంటా మధుకృష్ణ సేవలను అభినందించారు. మంగళవారం ప్రారంభించిన క్రీడలు ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అలాగే 8, 9, 10 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్‌పోటీలు, 11, 12, 13 తేదీల్లో కబడ్డీ పోటీలు, 15న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు వెంకటేశ్వరరావు, పిన్నమనేని చిన్నబాబు, కొర్లపాటి రాము, రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, సర్పంచ్ కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి వేలివెన్నులో క్రికెట్ పోటీలు

ఉండ్రాజవరం, జనవరి 2: సంక్రాంతి సంబరాల్లో బాగంగా మండలంలోని వేలివెన్నులో ఈనెల 3వ తేదీ నుంచి నియోజకవర్గస్థాయిలో శశిధర్ మెమోరియల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంక్రాంతి సంబరాలు కన్వీనర్, గ్రామసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో 56 క్రికెట్ జట్లు పాల్గొంటున్నట్లు చెప్పారు.

కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గజ్జరంలో గోదావరి జలాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

తాళ్లపూడి, జనవరి 2: మండలంలోని గజ్జరం గ్రామంలో బీసీ కాలనీలో పునఃనిర్మించిన కనకదుర్గమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు చేట్టారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచన జరిపారు. అలాగే నూతన విగ్రహాలకు ధాన్యాధివాసం, జలాదివాసం, హోమాది కార్యక్రమాలతోపాటు మహిళలు గోదావరి జలాలు నింపిన కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు రంగాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, జనవరి 2: ఒక బైక్ మరో బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. రాజమహేంద్రవరం లాలాచెరువు ప్రాంతానికి చెందిన కోటిపల్లి ఆంజనేయప్రసాద్‌కు కొవ్వూరు మండలం ఐ.పంగిడిలో వ్యవసాయ భూమి ఉంది. డిసెంబరు 31న అతడు స్నేహితుడు ఏడుకొండలతో బైక్‌పై పంగిడి వచ్చాడు. వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా దొమ్మేరు దాటిన తర్వాత వెనుక నుంచి వస్తున్న పల్సర్ బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి ఇద్దరూ కింద పడిపోవడంతో గాయాలయ్యాయని ఆంజనేయప్రసాద్ పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసున మోదు చేసినట్టు సీఐ తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

కొవ్వూరు, జనవరి 2: చాగల్లు మండలం కలవలపల్లిలో ఎస్ఈబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి సారా విక్రయిస్తున్న మట్టా సుబ్బలక్ష్మిని అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి 22 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిడదవోలు కోర్టులో హాజరు పర్చినట్టు ఎస్ఈబీ సీఐ వి.సత్యనారాయణ తెలిపారు.

నేటి నుంచి 'ఆరోగ్య సురక్ష'

కొవ్వూరు, జనవరి 2: కొవ్వూరు మున్సిపాలిటీలో ఈ నెల 3వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. 3న శ్రీరామకాలనీ సచివాలయం, 10న క్రిస్టియన్ పేట, 17న ఇందిరమ్మకాలనీ, 24న ఆవుల వారి వీధి, 31న మద్దిపట్ల వారి వీధి, ఫిబ్రవరి 7న గౌతమీనగర్-1, 14న గౌతమీనగర్-2, 21న ఔరంగాబాద్, 28న ఎన్‌జీవో హోం సచివాలయం-1, మార్చి 6న ఎన్‌జీవో హోం సచివాల యం-2లో ప్రతి బుధవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్త్ క్యాంపులు జరుగుతాయని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

బెదిరింపులు సరికాదు

» ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాణిక్యాంబ
» 22వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
» ఆంబోతు, గేదెలకు వినతిపత్రాలు సమర్పించి నిరసన



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కొవ్వూరు, జనవరి 2: న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వం ఫిబ్రవరి 5వ తేదీలోగా సమ్మె విరమించి విధులకు హాజరు కాకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని బెదిరించడం సరైందికాదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, ఆంబోతుకు వినతిపత్రం అందజేశారు. మాణిక్యాంబ మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు పీవోడబ్ల్యూ నాయకురాలు ఈమని మల్లిక, ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్ రమేష్, నాగేశ్వరరావు మద్దతు తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ పుష్పావతి, ఎ.నరసమాంబ, బి.వ ద్మజ, బి.వసంత, డి.అమరావతి, సీహెచ్.బ్రహ్మమ్మ, వి.శ్రీదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయం వద్ద రోడ్డుపై కూర్చునే అంగన్‌వాడీలు రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో జువ్వల రాంబాబు, పద్మ, రత్నకుమారి, మాధవి, మమత, బోడెమ్మ, వెంకాయమ్మ, కరుణకుమారి తదితర్లు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురంలో అంగన్వాడీలు సమ్మె చేపట్టారు. దున్నపోతు మీద వర్షం పడింది అన్న చందంగా ప్రభుత్వం తీరు ఉందని సీఐటీయూ మండలాధ్యక్షురాలు రామలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని దున్నపోతుకు ఇస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు సమ్మె చేపట్టారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వం దిగొచ్చేంత వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు.

దేవరపల్లి: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు 21రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం దున్నపోతుమీద వర్షం కురిసినట్లు వ్యవహరిస్తోందని సీఐటీయూ నాయకులు ఎస్.భగత్, అంగన్వాడీ నియోజకవర్గ నాయకురాలు లక్ష్మి విమర్శించారు. దేవరపల్లిలో వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని దున్నపోతుకు ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు కే.రత్నాజీ, పద్మకామేశ్వరి, కుమారి, గంగాభవాని, మహాలక్ష్మి పాల్గొన్నారు.

పెరవలి: పెరవలిలో అంగన్‌వాడీలు గేదెకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను విజయవంతం చేయడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని తమను పూర్తిగా వాడుకున్న సీఎం జగన్ ప్రస్తుతం కూరలో కర్వే పాకులా తీసిపారేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో ప్రాజెక్టు యూనియన్ సెక్రటరీ కె. కృష్ణవేణి, నాగవేణి, నిర్మల, కుమారి పాల్గొన్నారు.



నిడదవోలులో రోడ్డుపై కూర్చుని అంగన్‌వాడీల నిరసన



తాళ్లపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



దేవరపల్లిలో గేదెకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు



పెరవలిలో గేదెదూడకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు

» హోం మంత్రి వనిత.. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



చాగల్లులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి/కొవ్వూరు/చాగల్లు, జనవరి 2: విద్య ఎంతో విలువైన ఆస్తి అని, అటువంటి విద్యను పేదింటి పిల్లలకు ఉచితంగా అందించాలని పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తూ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. తాళ్లపూడి మండలం పెద్దేవం, కొవ్వూరు మండలం దొమ్మేరు, చాగల్లు మండలంలోని జడ్పీ హైస్కూళ్లలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను మంగళవారం ఆమె పం పిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారంగంలో వినూత్న సంస్కరణలు తీసుకువచ్చి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ట్యాబ్‌ల పంపిణీని ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదన్నారు. బైజూస్ కంటెంట్‌తో అందించి ట్యాబ్‌లలో లాకింగ్ సిస్టం ఉందన్నారు. ఎవరికైనా ఇబ్బం ది కలిగితే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా విద్యారంగంపై ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో పెద్దేవంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఉపసర్పంచ్ తోట రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సువర్చల, జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, కొలిశెట్టి నాగేశ్వరరావు, చింతా వెంకటస్వామి పాల్గొనగా దొమ్మేరులో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్ తానేటి కుమారి, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ఎంపీడీవో కె.సుశీల పాల్గొన్నారు. ఎంఈవో వి.ఖాదర్‌బాబు, హెచ్ఎం పి.వీ రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం

కొవ్వూరు, జనవరి 2: మండలంలోని మద్దూరు జడ్పీ హైస్కూల్లో మహాత్మ గాంధీ, మదర్‌థెరిస్సా, సరస్వతిదేవి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. నూతనంగా నిర్మించిన డైనింగ్ హాలు, సైకిల్ షెడ్డులను ప్రారంభించారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక సాయిబాబా కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రాజరాజేశ్వరి మల్లికార్జునస్వామి ఆలయంలో మంత్రి వనిత పూజలు నిర్వహించారు. క్యాడ్‌బర్రి వారి మొండెలెజ్ ఇంటర్నేషనల్ ఇండియా ఫుడ్ లిమిటెడ్ మేనేజర్ రాజేష్ రామచంద్రను మంత్రి వనిత సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో పింఛన్ల పంపిణీ

దేవరపల్లి, జనవరి 2: సీఎం జగన్ ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద సొమ్ము పెంచిన వృద్ధాప్య పింఛన్లను ఆయన మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 44,687 పింఛన్లు ఉన్నాయన్నారు. మండలంలో కొత్తగా 235 పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. అలాగే గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామాల్లో మౌలిక సదుపా యాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జడ్పీటీసీ స్వర్ణలత, ఎంపీటీసీలు కామిశెట్టి శిరోమణి, రామలక్ష్మి, సర్పంచ్ కడిమి వీరకుమారి, కవల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

గోపాలపురం, జనవరి 2: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 4వ తేదీ నుంచి ధర్నా నిరహిస్తున్నట్టు ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఎస్‌వీ మహేష్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏపీ గ్రామీణ ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. న్యాయపరమైన తమ డిమాండ్ల సాధనకై విజయవాడ కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయం ఎదుట ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. కనీసవేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఎఫ్‌టీఈ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలోని పంచాయతీల్లోని ఎఫ్ఏలు భారీగా వచ్చి ధర్నా విజయవంతం చేయాలన్నారు.

అధినేతలు ఆగయా..

» నేడు సీఎం జగన్ కాకినాడ రాక
» రంగరాయ మెడికల్ కాలేజీ మైదానంలో బహిరంగ సభ
» పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక నిధులు విడుదల
» జిల్లా పార్టీ నేతలతో హెలీప్యాడ్ వద్ద సమీక్ష
» సీఎం సభకు జిల్లావ్యాప్తంగా భారీ జనసమీకరణ
» 4న పవన్ కాకినాడకు రాక: మూడురోజులు ఇక్కడే
» కాకినాడసిటీ, ఉమ్మడి 'తూర్పు' నియోజకవర్గాలపై సమీక్ష
» 10న తుని రానున్న టీడీపీ అధినేత చంద్రబాబు
» 20న మండపేట, 27న గోపాలపురంలో బాబు సభలు
» పార్టీల అధినేతల వరుస పర్యటనలతో జిల్లాలో ఎన్నికల జోష్



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎన్నికల వేడి ఊపందుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల అధినేతల వరుస పర్యటనలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వేడెక్కుతోంది. ముంచుకొస్తున్న అసెంబ్లీ ఎన్నికల సమరాన్ని ముందే తెచ్చేస్తోంది. ఇందుకు నిదర్శనమే జిల్లాలో సీఎం జగన్, జనసేన అధినేత పవన్, టీడీపీ అధినేత చం ద్రబాబుల వరుస పర్యటనలు.. సభలు నిర్వహిస్తున్న తీరు. రోజుల వ్యవధి లోనే ఈ ముగ్గురు అధినేతలు జిల్లాలోకి అడుగుపెట్టబోతున్నారు. అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన సంక్షేమంపై చెప్పుకోవడానికి సీఎం జగన్ నేడు కాకినాడ పర్యటిస్తుండగా, ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమె త్తుతూ పోరాడుతున్న జనసేన అధినేత పవన్ ఈనెల 4న, టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10,20,27 తేదీల్లో మూడు పార్లమెంట్ కేంద్రాల్లో బహి రంగ సభలు నిర్వహించబోతున్నారు.

సీఎం వస్తున్నారు...జనాన్ని తోలండి...

సీఎం జగన్ బుధవారం కాకినాడ నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 9.40 గంటలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయలుదేరి 10.20గంటలకు కాకినాడ పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుషో ద్వారా రంగరాయ మెడికల్ కాలేజీ మైదానానికి చేరుకుంటారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్ కానుక నిధులను జగన్ విడుదల చేస్తారు. ఈనెల నుంచి రూ.3 వేల పెన్షన్ డబ్బులను చెల్లిస్తున్న నేపథ్యంలో దాన్ని ప్రచారం చేసుకోవడానికి వీలుగా అక్కడే భారీ బహిరంగసభలో సీఎం ప్రసంగించనున్నారు. అక్కడ గంటపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి తాడేపల్లికి పయనమవుతారు. బహిరంగ సభకు ముందు కాకినాడ నగరంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి సీఎం జగన్ ప్రారంభోత్సవాలను చేయనున్నారు. కాగా సీఎం జగన్ సభకు వేలల్లో జనాలను తరలించేందుకు ప్రభుత్వం అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి జనాలను తరలించేందుకు పార్టీ నేతలు, అధికారులకు టార్గెట్లు విధించింది. ప్రధానంగా వలంటీర్లు అయితే తమ పరిధిలోని పింఛన్‌దారులను బెదిరిస్తూ ఆడియో మెసేజ్‌లు పంపారు. సీఎం సభకు రాకపోతే పెరిగిన పెన్షన్ డబ్బులు అందవని కూడా హెచ్చరిం చారు. ఈమేరకు కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఓ వలంటీర్ బెదిరింపుల ఆడి యో బయటకు లీకైంది. మరోపక్క ప్రతిపక్ష టీడీపీ నిర్వహించే కార్యక్రమాలకు ఒక్క బస్సు కూడా అద్దెకు ఇవ్వని ఆర్టీసీ, సీఎం సభ కోసం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి 318 బస్సులను పంపు తోంది. ఆయా జిల్లాల నుంచి సీఎం సభ కోసం ఇవన్నీ బుధవారం ఉదయం కాకినాడకు చేరుకోనున్నాయి.

మూడు రోజులు పవన్ ఇక్కడే...

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 4న కాకినాడకు రానున్నారు. మూడురోజులపాటు ఓ ప్రైవేటు అతిథిగృహంలో బసచేయనున్నారు. తొలి రోజు కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి 28 వార్డులపై విడివిడిగా సమీక్షించనున్నారు. ఆ తర్వాత కాకినాడ రూరల్, అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 12 నియోజకవర్గాలపై సమీక్షిస్తారు. వాస్తవానికి గత నెల 27 నుంచి పవన్‌కల్యాణ్ కాకినాడలో మూడు రోజులు మకాం వేశారు. కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలపై కూలంకుష సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాలవారీగా పార్టీ బలాబలా లపై సమీక్షించారు. ఎక్కడ పోటీచేస్తే బాగుంటుంది? ఎక్కడ ఇంకా పార్టీ మరింత బలోపేతం అవ్వాలి? అనేదానిపై ఇంఛార్జులతో సమీక్షించారు. ఆ తర్వాత మరో రెండు రోజులు కాకినాడ సిటీ నియోజకవర్గంపై సమీక్షించారు. తద్వారా కాకినాడ సిటీ నుంచి అసెంబ్లీకి పవన్ పోటీచేస్తారనే ప్రచారానికి మరింత బలం కల్పించారు. తిరిగి మళ్లీ ఈనెల 4నుంచి మూడు రోజులు ఇక్కడే మకాం వేయడం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది.

లక్ష మందితో దద్దరిల్లేలా...

టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10న తునికి వస్తున్నారు. ఆరోజు లక్ష మందితో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. జగన్ ప్రభుత్వ అరాచకాలు, అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభల ద్వారా విరుచుకుపడుతున్న చంద్రబాబు అందులో భాగంగా కాకినాడ పార్లమెంట్‌కు సంబంధించి సభను తునిలో నిర్వహిస్తున్నారు. తొలుత పెద్దాపురం నియోజక వర్గంలో పర్యటన ఖాయం అయినా ఆ తర్వాత వేదిక తునికి మార్చారు. ఆ రోజు కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి లక్ష మందికి పైగా తునికి చేరుకునేలా జిల్లా టీడీపీ సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి సంక్రాంతి తర్వాత సభ నిర్వహించాలని భావించారు. కానీ ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో వాయిదా వేయకుండా సభ జరపాలని పార్టీ వర్గాలు నిర్ణయించాయి. మరోపక్క డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం పార్లమెంట్ పరిధిలో సభను మండపేటలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు జనవరి 20వ తేదీ ఖరారు చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో గోపాలపురంలో ఈనెల 27న చంద్రబాబు బహిరంగ సభను లక్ష మందితో నిర్వహించనున్నారు. కాగా ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించింది. పార్టీలో ఎనలేని ఉత్సాహాన్ని నింపి క్యాడర్‌లో విజయోత్సాన్ని నింపింది. తిరిగి స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టై బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు మళ్లీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మూడు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తుండడం విశేషం.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

ఉండ్రాజవరం, జనవరి 2: మండలంలోని వేలివెన్నులో అయోధ్య రాముని అక్షింతలు మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామంలో గడప గడపకు అక్షింతలు, రామమందిరం ఫొటో ఇచ్చారు. గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

చాగల్లు రైల్వేగేటు నాలుగు రోజులు మూసివేత

చాగల్లు, జనవరి 2: చాగల్లు రైల్వేస్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతుల నిమిత్తం రైల్వేగేటును నాలుగు రోజులు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. చాగల్లు-మార్కొండపాడు రైల్వే క్రాసింగ్ గేటును మూసివేస్తున్నందున ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసుకోవాలన్నారు.





